**అగ్రనేత**

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :135 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది:బుధవారం 30-07-2025 | పేజీలు:4 వెల: 2.00

## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షాలు..

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు ముంచెత్తాయి. మంగళవారం ఉదయం నుంచి కుండపోతగా వర్షం కురుస్తోంది. ఢిల్లీ అంతటా కారు మేఘాలు కమ్ముకున్నాయి. ఉదయం నుంచే చీకట్లు అలుముకున్నాయి.రహదారులు జలమయం అయ్యాయి. ఉదయాన్నే ఉద్యోగులకు వెళ్లే వారంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక వాహనదారులు కూడా తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు.ఇక భారీ వర్షం కారణంగా విమాన రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రమాణాల్లో మార్పులు.. చేర్పులు ఉంటాయని విమానయాన సంస్థలు ప్రయాణికులకు హెచ్చరికలు జారీ చేశాయి. ఈదురుగాలుల కారణంగా విమాన కార్యకలాపాల్లో ఇబ్బం దులుంటాయని ఎయిరిండియా తెలిపింది.ఇదిలా ఉంటే ఢిల్లీకి కేంద్ర వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఢిల్లీ అంతటా, ఎన్‌సీఆర్ తూర్పు ప్రాంతాలకు అలర్ట్ జారీ చేసింది. రాబోయే గంట లేదా రెండు గంటల్లో తీవ్రమైన వర్షాలు కురిసే అవకాశం ఉందని వార్నింగ్ ఇచ్చింది.

# పహల్గాం దాడి ఉగ్రవాదుల్లో ముగ్గుర్ని హతమార్చాం..



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ పై లోక్‌సభలో రెండో రోజు చర్చ కొనసాగుతోంది. ఈ చర్చ సందర్భంగా ఇవాళ షా మాట్లాడారు. పహల్గాం ప్రతీకారాన్ని ధృవీకరించారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని మట్టుబెట్టినట్లు వెల్లడించారు.'పహల్గాంలో పర్యాటకులను హత్య చేశారు. టూరిస్టులను ఉగ్రవాదులు అతికిరాతకంగా హత్య చేశారు. కుటుంబ సభ్యులు ముందే కాల్చి చంపారు. మంతం, పేరు అడిగి మరీ చంపడం దారుణం. పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదుల్లో ముగ్గురిని హతమార్చాం. ఈనెల 22న శాటిలైట్ ఫోన్ సిగ్నల్ ద్వారా ఉగ్రవాదుల కదలికలను గుర్తించాం. ఆపరేషన్ మహాదేవ్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఉగ్రదాడి జరిగిన రోజునే జమ్ము భద్రతపై సమీక్షించాం. ఉగ్రవాదులను ఆశ్రయం ఇచ్చిన వారిని కూడా అరెస్ట్ చేశాం. ఉగ్రశిబిరాలను మట్టిలో కలిపేశాం. ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, జమ్ము పోలీసులకు అభినందనలు' అని అమిత్ షా తెలిపారు. ఉగ్రవాదుల్ని హతమార్చాం అంటే విపక్షాలు సంతోషిస్తాయనుకున్నానని, కానీ సందేహాలు వ్యక్తం చేస్తున్నారంటూ షా వ్యాఖ్యానించారు.

### నెల నుంచి జల్లెడ పట్టి..

జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్ సమీపంలో ఉన్న హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్టు నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో గడిచిన నెలరోజులుగా ఆ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. లష్కరే, జైషే ఉగ్రవాదుల కదలికల కోసం గడిచిన 14 రోజులుగా మరింత ముమ్మరంగా నిఘాను పెంచాయి. ఈ క్రమంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో రెండు రోజుల కిందట అనుమానస్పద కమ్యూనికేషన్లను భారత సైన్యం పసిగట్టింది. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో దాచిగామ్ నేషనల్ పార్క్ పరిసరాల్లో ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించిన భద్రతాదళాలు.. మెరుపు వేగంతో కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఉగ్రవాది సులేమాన్ షాతో పాటు పహల్గాం దాడికి కారణమైన మరో ఉగ్రవాది యాసిర్ హతమైనట్టు అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో మరో ఉగ్రవాది అబూ హామ్‌జా కూడా హతమైనట్టు పేర్కొన్నారు. వీరందరూ విదేశీ ఉగ్రవాదులేనని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్ముకశ్మీర్ పోలీసులు పాలుపంచుకొన్నట్టు పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్ అనంతరం జరిపిన సోదాల్లో 17 గ్రెనేడ్లు, ఒక ఎం4 కార్బైన్, రెండు ఏకే 47 రైఫిల్స్‌ను భద్రతాదళాలు స్వాధీనం చేసుకొన్నాయి.

# కేటీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్.. సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలను ఖండించలేదేం



హైదరాబాద్,ఇటీవల బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ మాజీ మంత్రి కేటీఆర్ పై సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. "కవిత అరెస్ట్ తర్వాత నువ్వే నా ఇంటికి వచ్చావు.బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేస్తానని అప్పుడే చెప్పావు. కవితను విడుదల చేస్తే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తానని నువ్వు చెప్పిన విషయం మరిచిపోయావా?" అని ప్రశ్నించారు. అలాగే, "నా వల్లే నువ్వు ఎన్నికల్లో గెలిచావు. కేవలం 300 ఓట్ల మెజారిటీతో గెలిచిన విషయం నీకు తెలుసు. నీ గురించి చెప్పాలంటే చాలా విషయాలు ఉన్నాయి, కానీ నా సంస్కారం అడ్డువస్తోంది" అని సీఎం రమేష్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ రియాక్ట్ కాలేదు. ఈ క్రమంలో కేటీఆర్‌కు మంత్రి సీతక్క సవాల్ విసిరారు. సీఎం రమేష్ ఇంటికి వెళ్లిన విషయంపై కేటీఆర్ ఎందుకు క్లారిటీ ఇవ్వట్లేదు..? సీఎం రమేష్ ఇంటికి వెళ్ళలేదు, బిజెపితో కుమ్మక్కు కాలేదు అని ఎందుకు క్లారిటీ ఇవ్వడం లేదు.. అసెంబ్లీ ఎన్నికల్లో మీ పార్టీకి, మా పార్టీకి ఒక శాతం ఓట్ల తేడా మాత్రమే అని కేటీఆర్ అన్నారు.. మరి లోక్ సభ ఎన్నికల్లో మీరు మీ పార్టీ బీజేపికి ఓట్లు వేయించింది నిజమా..?కాదా..? ఈ ప్రశ్నలకు కేటీఆర్ గుండెపై చేయి వేసుకుని సమాధానం చెప్పాలి.. కేటీఆర్ అబద్ధాలు మాట్లాడుతారనేది ఎంపీ రమేష్ మాటల్లో చూశాం.. ఎన్ని అబద్ధాలు చెప్పినా.. కొద్ది రోజుల్లో నిజం తెలుస్తుందని మంత్రి సీతక్క వెల్లడించారు.

# సింగపూర్ ప్రభుత్వానికి థాంక్స్ చెప్పిన సీఎం..



అమరావతి, సింగపూర్ ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున థాంక్స్ చెప్పారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఏపీ, అమరావతి అభివృద్ధిలో సింగపూర్ ప్రభుత్వం భాగస్వామ్యం అవుతుంది అంటూ ఆ దేశ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మంత్రి టాన్సీ లెంగ్ ప్రకటించడంపై ఆనందాన్ని వ్యక్తం చేసిన ఆయన..సోషల్ మీడియా వేదికగా.. వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధమన్న సింగపూర్ మంత్రి టాన్సీ లెంగ్ ప్రకటనకు ధన్యవాదాలు తెలిపారు.. ఎక్స్ వేదికగా సింగపూర్ మంత్రికి ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు. ఏపీ ప్రజల తరపున సింగపూర్ ప్రభుత్వానికి.. మంత్రి టాన్సీ లెంగ్ కు ధన్యవాదాలు చెప్పారు..ఏపీ సుస్థిరాభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వంతో భాగస్వామిగా ఉండడానికి సింగపూర్ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషం.. వివిధ రంగాల్లో ఏపీ–సింగపూర్ కలిసి పని చేయడానికి టాన్సీ లెంగ్ తో జరిపిన చర్చలు బాటలు వేశాయని పేర్కొన్నారు చంద్రబాబు. అగ్రి–ఫుడ్, ఉత్పాదక రంగం, రెన్యూవబుల్ ఎనర్జీ, పోర్టులు, డిజిటల్, ఇన్నోవేషన్, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కలిసి పని చేసేందుకు ఈ చర్చలు దోహదపడతాయి. 90వ దశకం నుంచి సింగపూర్ ప్రభుత్వంతో మాకు సత్సంబంధాలు ఉన్నాయి. ఏపీ అభివృద్ధిలో సింగపూర్ భాగస్వామ్యం చాలా విలువైనది అని తెలిపారు.. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో.. ఆధునిక మౌలిక వసతుల కల్పనలో సింగపూర్ ప్రభుత్వం నుంచి చక్కటి సహకారం అభిలషిస్తున్నాం. కొన్ని పరిణామాల వల్ల సింగపూర్ భాగస్వామ్యంతో చేసే అభివృద్ధి ప్రయాణంలో కొంత ఇబ్బంది వచ్చింది. ఇప్పుడు ఏపీలో ప్రజలు ఇచ్చిన ప్రజా తీర్పుతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సంకల్పం తీసుకున్నాం అన్నారు..ఇక, స్వర్ణాంధ్ర–2047 సాధన దిశగా అడుగులు వేస్తున్నాం అని పేర్కొన్నారు చంద్రబాబు.. వివిధ రంగాల్లో సింగపూర్ దేశ విధానాలు మాకెప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.. పట్టణ, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా మేం వేసుకున్న ప్రణాళికలకు సింగపూర్ తోడైతే ప్రజల ఆశలను నెరవేర్చగలం అన్నారు.. పరస్పరం గౌరవించుకుంటూ వివిధ రంగాల్లో అభివృద్ధికి సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేద్దాం.. అంటూ ఎక్స్‌లో పేర్కొన్నారు (ట్వీట్ చేశారు) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు..

# చిరాగ్ పాశ్వాన్ యూటర్న్..



పాట్నా: కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ ప్లేట్ ఫిరాయించారు. బీహార్‌లో నేరాలు పెరిగిపోయాయని, శాంతి భద్రతలు క్షీణించాయని రెండు రోజుల క్రితం సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వంపై విరుచుకుపడిన ఆయన మాట మార్చారు. మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని చెప్పారు. ప్రధాని మోదీ సారథ్యంలో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్త చేశారు. తమది గెలుపు కలయిక అని వెల్లడించారు. ఇప్పటికే చాలాసార్లు చెప్పాను.. ప్రధాని మోదీ నాయకత్వంలోనే బీహార్‌లో ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల ఫలితాల తర్వాత నితీశ్ కుమార్ మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారు. ఆయన కచ్చితంగా ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రధానిపై విమర్శలు చేస్తున్న విపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.కాగా, ఈ నెల 26న పాట్నాలో మీడియాతో మాట్లాడిన చిరాజ్.. సీఎం నితీశ్ ప్రభుత్వం నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. నేరాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఈ మేరకు అధికారంలోని నితీశ్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినందుకు చింతిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో నేరాలు, దోపిడీలు, అత్యాచారాలు, హత్యలు, కిడ్నాప్‌లు పెరిగిపోయాయన్నారు. రాష్ట్రంలో ప్రజలు సురక్షితంగా ఉండలేకపోతు న్నారన్నారు. ప్రజలను రక్షించే స్థితిలో ప్రభుత్వం లేదని.. అలాంటి ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నందుకు చింతిస్తున్నట్లు ఈ సందర్భంగా పాశ్వాన్ వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మేల్కొని నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

# ప్రభుత్వంలో ముసలం.. సిద్ధరామయ్య సమావేశాలకు డీకే.శివకుమార్ దూరం!



బెంగళూర్ :కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో ముసలం మొదలైనట్లుగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి మార్పిడిపై సిద్ధరామయ్య–డీకే.శివకుమార్ వర్గీయుల మధ్య కొద్ది రోజులుగా ఘర్షణ జరుగుతోంది.ఈ ఘర్షణ చివరికి హస్తినకు కూడా చేరింది. రెండు వర్గాలకు చెందిన అధికారులు ఢిల్లీలో కొట్టుకునే స్థాయికి వెళ్లింది. ఈ వ్యవహారం హైకమాండ్ పెద్దల దృష్టికి కూడా వెళ్లినట్లు సమాచారం. తాజాగా సిద్ధరామయ్య సమావేశాలకు డీకే.శివకుమార్ దూరం జరిగినట్లుగా తెలుస్తోంది. అనారోగ్యమా? లేదంటే కావాలనే పక్కన పెట్టారా? అనేది తేలాల్సి ఉంది.కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమావేశం ఏర్పాటు చేసి రూ.50 కోట్ల నియోజకవర్గ గ్రాంట్లపై చర్చించారు. ఎమ్మెల్యేలంతా హాజరు గానీ.. ఈ సమావేశానికి శివకుమార్ మాత్రం హాజరు కాలేదు. ఉద్దేశ పూర్వకంగానే డీకే.శివకుమార్‌ను పక్కన పెట్టారా? లేదంటే సిద్ధరామయ్యతో సంబంధాలు దెబ్బతిన్నాయా? అనే చర్చలు పార్టీ వర్గాల్లో నడుస్తున్నాయి.పార్టీని అధికారంలోకి నడిపించిన శివకుమార్‌ను పార్టీ సమావేశాలకు దూరం పెట్టడంపై ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలో అంతర్గత విభేదాలు మొదలయ్యాయని ప్రజలు భావిస్తారని అభిప్రాయపడుతున్నారు. అయితే దీనిపై హోంమంత్రి పరమేశ్వర్ స్పందిస్తూ.. సిద్ధరామయ్యను సమర్థిస్తూ గతంలో ఇలాంటి సమావేశాలు చాలా జరిగాయని చెప్పుకొచ్చారు. అయితే అంతర్గత కలహాలు మాని కలిసి పని చేయాలని హైకమాండ్ సూచించింది. కానీ శివకుమార్‌ను పక్కన పెట్టి సిద్ధరామయ్య సమావేశాలు నిర్వహించడం ఎటువైపు పరిణామాలు దారి తీస్తాయో చూడాలి.ఇదిలా ఉంటే ఎమ్మెల్యేలతో సమావేశం కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో కాకుండా ముఖ్యమంత్రి విధానసౌధలోని తన చాంబర్‌లో సమావేశాలు నిర్వహించడం మరిన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. శివకుమార్‌ను నియంత్రణలోకి తీసుకురావడానికే ఉద్దేశపూర్వకంగా ఇలా చేస్తున్నారంటూ చర్చ నడుస్తోంది.

# సీఎం రమేష్ అంటే చీటింగ్.. మనీ లాండరింగ్...



హైదరాబాద్, జులై 29: సీఎం రమేష్ అంటే చీటింగ్, మనీ లాండరింగ్ అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి మండిపడ్డారు.ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ , తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలలో కాంగ్రెస్, దేశంలో బీజేపీ కోసం పనిచేస్తున్న బ్రోకర్ అని, రాజకీయంగా పెద్ద జోకర్ అని ధ్వజమెత్తారు. సీఎం రమేష్ కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలు పోషిస్తున్న సుపారీ కిల్లర్ అని, డబ్బు మూటల కోసం దళారిగా, రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిత్వాన్ని చంపేసే తలారీగా మారాడని జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు. అధికారం అండతో ప్రజాధనాన్ని మెక్కే పందికొక్కు సీఎం రమేష్.. చంద్రబాబు నాయుడుకు బినామీ, దోపిడీలో సునామీ అని విమర్శించారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలలో కాంగ్రెస్ నేతలతో కలిసి అక్రమ దందాలతో డబ్బు కూడబెట్టుకుంటూ తనపై ఈడీ, ఐటీ దాడులు తప్పించుకునేందుకు బీజేపీ పంచన చేరాడని దుయ్యబట్టారు. హెచ్‌సీయూ భూములు తాకట్టుపెట్టి రూ.10 వేల కోట్ల అప్పు తీసుకోవడంలో రేవంత్ సర్కారుకు బ్రోకర్‌గా పని చేశాడని ఆరోపించారు.దానికి ప్రతిఫలంగా ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్ ఆడుతున్న అవినీతి ఆటలో రూ.13వందల కోట్ల టెండర్లు దక్కించుకున్నారని, అందుకు కృతజ్ఞతగా చంద్రబాబు, రేవంత్ తరపున వకాల్తా పుచ్చుకొని బీఆర్ఎస్‌పై సీఎం రమేష్ విషం కక్కుతున్నాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ దాడి చేసిందన్నారు. సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిల స్క్రిప్టులో భాగమేనని, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో లబ్ధి కోసం కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ కుట్రలు షురూ చేసిందనడానికి ఆయన వ్యాఖ్యలే నిదర్శనమని చెప్పారు. చంద్రబాబు, రేవంత్ ఆదేశాల ప్రకారమే తెలంగాణలో అన్నదమ్ముల్లా బతుకుతున్న ప్రజల మధ్య కులాల కుంపటి రాజేసే కుట్ర జరుగుతోందన్నారు. కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలను బీఆర్ఎస్‌కు దూరం చేసే దుష్ట పన్నాగం పన్నారని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం లభించిందన్నారు. కమ్మ సామాజిక వర్గంపై కేటీఆర్ తప్పుడు వ్యాఖ్యలు చేసినట్టు సీఎం రమేష్ గోబెల్స్ మాటలు చెప్పడం ఈ దశాబ్దపు జోక్‌గా అభివర్ణించారు.కమ్మ సామాజిక వర్గానికి ఏ పార్టీలో లభించనంత గౌరవం బీఆర్ఎస్‌లోనే దక్కిందన్నారు. కమ్మ సామాజికవర్గం వారు బీఆర్ఎస్‌కు అవసరం లేదని కేటీఆర్ అన్నట్లు రమేష్ చేసిన వ్యాఖ్యలు పచ్చి అబద్ధమన్నారు. నిన్నటికి నిన్న కమ్మ సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అనారోగ్యంతో మృతి చెందితే కేటీఆర్ కుటుంబం ఎలా స్పందించిందో ప్రజలంతా చూశారన్నారు. గోపీనాథ్ ఆసుపత్రిలో చేరిన నాటి నుంచి ఆయనను బతికించుకోవడానికి అత్యాధునిక వైద్య చికిత్స అందేలా కేటీఆర్ ఫ్యామిలీ చేయని ప్రయత్నం లేదని తెలిపారు. దురదృష్ట వశాత్తూ అనారోగ్యంతో మరణించగా ఆయన అంత్యక్రియల దగ్గర నుంచి దశదిన కర్మల వరకూ కేటీఆర్ కుటుంబమంతా అక్కడే ఉండి అంతా తామే అయి అన్ని కార్యక్రమాలు జరిపించిన విషయం సీఎం రమేష్ గుడ్డి కండ్లకు కనిపించలేదా? అని ఆయన నిలదీశారు. గతంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన అక్కినేని నాగేశ్వరరావు, రామానాయుడు, సూపర్ స్టార్ కృష్ణ వంటి వారు చనిపోతే అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించింది కేసీఆర్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు సొంత బావ మరిది హరికృష్ణ దురదృష్టవశాత్తూ రోడ్డు ప్రమాదంలో చనిపోతే వారి అంత్యక్రియలను కూడా అధికార లాంఛనాలతో జరిపించడమే కాక ఆయన స్మారక చిహ్నం కోసం భూమి కేటాయించింది కేసీఆర్ ప్రభుత్వమన్న విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు.ఆరు ఎమ్మెల్యే టిక్కెట్లు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారికి ఇచ్చి వారిని గెలిపించుకోవడమే కాక మంత్రివర్గంలోకి తీసుకున్న పార్టీ బీఆర్ఎస్ అని జీవన్ రెడ్డి గుర్తు చేశారు. ఖమ్మం ఎంపీగా గెలిచిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన నామా నాగేశ్వరరావును లోక్‌సభలో బీఆర్ఎస్ పక్ష నేతగా చేయలేదా? అని ఆయన రమేష్ పై నిప్పులు చెరిగారు. మూడు నాలుగు జిల్లాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవులు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారికి ఇచ్చి సమున్నత గౌరవం కలిపించామని, తాతా మధుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది కేసీఆరేనని చెప్పారు. ఇంకా పలు ప్రభుత్వ, పార్టీ పదవులు కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతలకు ఇచ్చామన్నారు. ఇంత చేసిన కేసీఆర్ ఫ్యామిలీ కమ్మ సామాజిక వర్గానికి వ్యతిరేకమని రమేష్ లాంటి బ్రోకర్లు ప్రచారం చేస్తే నమ్మేదెవరని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేటీఆర్ సింహం లాంటోడని, సీఎం రమేష్ వంటి ఊరకుక్కలతో బహిరంగ చర్చకు రమ్మంటే ఎలా వస్తారని ఆయన మండిపడ్డారు. సీఎం రమేష్ దొంగల ముఠాను తెలంగాణ పొలిమేరల దరి చేరనివ్వబోమని, హైదరాబాద్‌లో కాలుపెట్టకుండా తరిమికొడతాం ఖబడ్దార్ అని హెచ్చరించారు.

### కేసీఆర్ ఫ్యామిలీపై బండి సంజయ్ తొండి మాటలు

కేసీఆర్ ఫ్యామిలీ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తొండి మాటలు మాట్లాడుతూ అదేపనిగా బురదజల్లుతున్నాడని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర బీజేపీ నేతల తీరు బీఆర్ఎస్ పై కక్ష, కాంగ్రెస్‌కు రక్ష అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు.

# బిసి రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్ష



హైదరాబాద్,బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆగస్టు 4, 5, 6 తేదీల్లో తాను 72 గంటల పాటు నిరాహార దీక్ష చేయబోతున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి కోరి దీక్షకు దిగుతానని ఒక వేళ అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ కూర్చుంటే అక్కడే నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహ సాధన కోసం తాను 72 గంటలు దీక్ష చేస్తే నాటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ ....2018 పంచాయతీ రాజ్ సవరణ చట్టాన్ని సవరణ చేస్తూ తెలంగాణ జాగృతి చేసిన డిమాండ్ తోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ చేసిందని చెప్పారు. తమిళనాడులో గవర్నర్ జాప్యం చేస్తే కోర్టుకు వెళ్లి తీర్పు తెచ్చుకున్నారని మరి తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ వద్ద పెండింగ్ అంశంపై కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తే సానుకూల తీర్పు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కోర్టులో కేసు వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీకి ఉన్న ఒప్పందం కారణంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టుకు వెళ్లడం లేదని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేయాలన్నారు. తాము ఢిల్లీలో చేసే ధర్నాకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అంటు–న్నారు... ఇదేమైనా సత్రం భోజనమా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అఫీషియల్ గా అఖిలపక్షంను ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షం ఢిల్లీకి రావాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, అన్ని రాజకీయ పార్టీలకు ప్రభుత్వం లేఖలు రాయలన్నారు. పొన్నం ప్రభాకర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడు తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం డ్రామా చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా శూన్యం అని రిజర్వేషన్ల విషయంలో బీజేపీ తప్పించుకుంటోందని విమర్శించారు.

## సంపాదకీయం

బుధవారం 30-07-2025

# ప్రాణం పోద్దాం!

'మేము స్వేచ్ఛగా ఎగిరే పక్షులం. ప్రకృతి హితాన్ని కోరుకునే జీవులం. మా కిలకిలలు అంటే ఇష్టపడని మనుష్యులు ఉండరు. మా బ్రతుకు మేము బతుకుతుంటే మమ్మల్ని మీరు బతకనివ్వడంలేదు' అంటూ పక్షుల మనోభావాన్ని రాస్తాడో రచయిత. 'అడవిలోని ప్రతి జీవి%ౌ% అది చెట్టయినా, జంతువైనా, పక్షి అయినా%ౌ% నా దృష్టిలో వనదేవతలే' అంటాడు ధూర్జటి. అందుకే ఈ ప్రాచీన కవి ప్రకృతి సౌందర్యాన్ని తన కవిత్వంతో మిళితం చేసి ప్రకృతి ప్రాధాన్యతను వర్ణిస్తాడు. కృష్ణశాస్త్రి, జాషువా, శ్రీశ్రీ, ఆరుద్ర వంటి కవులు సైతం తమ కవిత్వాన్ని ప్రకృతితో అనుసంధానించారు. ప్రకృతిని తమ కవితా సృష్టిలో భాగం చేసుకున్నారు. ప్రకృతి పట్ల ప్రేమను, బాధ్యతను వెల్మోల్చిపారు. 'తలపై మండే వేడిని భరించి/ ప్రయాణికులకు చల్లని నీడనిచ్చే/ కఠినమైన రాళ్లపై కూడా పెరిగే/ పండులు, పువ్వులను ఇచ్చే/ తమ ప్రాణాలను త్యాగం చేసిన తర్వాత కూడా తమ శరీరాలను కోయడానికి ఇచ్చే..' అంటూ జంధ్యాల పాపయ్యశాస్త్రి అభివర్ణిస్తాడు. కానీ, కాలం మారడం మొదలైంది. వ్యాపార సంస్కృతితో వచ్చిన మార్పులు ప్రకృతి విధ్వంసానికి కారణమయ్యాయి. మనిషి తనలోని సున్నితత్వాన్ని కోల్పోయి, ప్రకృతికి విరుద్ధమైన జీవితం గడుపుతున్నాడు. దాని ఫలితమే కాలుష్యం వివిధ రూపాల్లో విస్ఫోటనం చెందుతోంది. నాగరికత ప్రకృతికి దూరంగా జరుగుతోంది. అభివృద్ధి పేరుతో పచ్చని పొలాలు, అడవులు వున్న చోట కర్మాగారాలు వెలుస్తున్నాయి. 'అభివృద్ధి అంటే కాంక్రీట్ కట్టడాలు కాదు, పక్షులు తిరిగే ఆకాశం, వాటి ఆవాసాలకు జాగా వుండే భూమి కూడా కావాలి' అంటారు పర్యావరణ శాస్త్రవేత్త వందనా శివ. గత పాతికేళ్లలో మన దేశంలో పక్షుల సంఖ్య 25 శాతం తగ్గిందంటే, అది కేవలం ప్రకృతి పరిహాసం కాదు, మన అజాగ్రత్తకు, నగరీకరణ పేరుతో జరుగుతున్న విధ్వంసానికి సజీవ సాక్ష్యం. ఫలితంగా పక్షిజాతి సంక్షోభంలో పడింది. 204కి పైగా పక్షి జాతులు అంతరించిపోయే దశలో వుండగా, 142 జాతులు ప్రస్తుతం క్షీణిస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్(ఎన్‌సిబిఎస్) ఈ మేరకు ఒక నివేదికను వెల్లడించింది. 'మా పరిశోధనలు ఒక భయంకరమైన సత్యాన్ని వెల్లడిస్తున్నాయి. దేశంలోని వైవిధ్యభరితమైన పక్షుల సంఖ్య గణనీయమైన క్షీణతను ఎదుర్కొంటోంది. సమన్వయంతో కూడిన పరిరక్షణ తక్షణ అవసరాన్ని నొక్కి చెబుతోంది' అంటూ ఎన్‌సిబిఎస్ వన్యప్రాణి జీవశాస్త్రం అధ్యయనవేత్త వివేక్ రామచంద్రన్ చెబుతున్నారు. ప్రపంచ జీవవైవిధ్యం కూడా దారుణమైన స్థితిలో వుంది. అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సమితి (ఐయుసిఎన్) నిర్వహించిన గ్లోబల్ రెడ్ లిస్ట్ అసెస్‌మెంట్స్‌లో జీవవైవిధ్యం యొక్క అన్ని కోణాలూ క్షీణతను చూపిస్తున్నాయి. తాజా లివింగ్ ప్లానెట్ నివేదిక-2 ప్రకారం%ౌ% క్షీరదాలు, పక్షులు, సరీసృపాలు, ఉభయచరాలు, చేపలు సంఖ్య 1970 నుంచి సగటున 69శాతం తగ్గాయి. ఇంత విస్తృత స్థాయిలో క్షీణతకు విధ్వంసక భూవినియోగం, ప్రకృతి దోపిడీ, వాతావరణ మార్పు, కాలుష్యం, రసాయనాలు జీవవైవిధ్యానికి హాని కలిగించడమే ప్రధాన కారణం. ఇది కేవలం పర్యావరణ సమస్య కాదు. ఇది జీవవైవిధ్యానికి, భవిష్యత్తరాలకు ప్రమాద సంకేతం. 'పక్షి అరుపు మనకు ఒక హెచ్చరిక. మనం వినకపోతే, రేపటి భూమి శూన్యంగా మారుతుంది' అంటారు భారత పక్షిశాస్త్ర పితామహుడు సలీం అలీ. పక్షుల సంఖ్య తగ్గుదల వ్యవసాయ దిగుబడి తగ్గడానికి దారి తీస్తుంది. హానికరమైన పురుగుమందులపై ఆధారపడటాన్ని తప్పనిసరి చేస్తుంది. ఇది ప్రజారోగ్యంపైన, దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. మన చుట్టూ వున్న ప్రతి జీవీ మన జీవితంలో భాగమే. అవి మాయమవకుండా వుండాలంటే మనం మారాలి. కాలుష్యానికి బలైపోయి కనుచూపుమేరలో కనిపించకుండా పోయి%ౌ% కథ వస్తువుగానో, కవితా వస్తువుగానో మిగిలిపోకుండా పక్షులను రక్షించుకుందాం. 'పక్షులు మన జీవ వ్యవస్థకు సజీవ చిహ్నాలు. అవి లేకపోతే ప్రకృతి సంగీతం మూగబోతుంది' అంటారు ప్రముఖ రచయిత అమితావ్ ఘోష్. పక్షుల పరిరక్షణ కోసం ప్రభుత్వాలు, పర్యావరణవేత్తలు, ప్రజలు కలిసి పనిచేయాలి. ప్రకృతిని కాపాడుకోవాలి. కాస్తంత పచ్చదనం పెంచితే, ఎన్నో పక్షి జాతులకు ప్రాణం పోసినవాళ్లమవుతాం.

# పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అపహాస్యం



న్యూఢిల్లీ,వారం రోజులుగా పార్లమెంటులో ప్రతిష్ఠంభన కొనసాగుతూనే ఉంది. సమస్యలపై చర్చించాలన్న ఆసక్తి అధికార విపక్షాలకు లేకుండా పోయింది. సభ ప్రారంభం కాగానే గోడవ చేయడం విపక్షాల వంతు అయితే వాయిదా వేయడం స్పీకర్ విధిగా మారింది. సోమవారం ఉద్యం కూడా ఇదే తరహాలో మధ్యాహ్నానికి సభ వాయిదా పడింది. దీనిబదులు సమస్యలు ముందుకు వేసుకుని ఏరోజు ఏది చర్చించాలన్నది నిర్ణయం తీసుకోవచ్చు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ రూపాల్లో చర్చించేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలి. కానీ ప్రతిష్టంభనతో సాధించేదేమీ లేదని ఇరు పక్షాలు కూడా గుర్తించాలి. ఇప్పుడు వర్షాకాల సమావేశాలు సైతం ఒక్కటంటే ఒక్క సమస్యపై చర్చించడం లేదు. ఈనెల 21న పార్లమెంట్ సమావేశాలు మొదలయ్యాయి. నేటికీ ఒక్క సమస్యపైనా చర్చలేదు. చర్చకు సిద్ధమని అధికార పక్షం చెబుతున్నా.. విపక్షాలకు మాత్రం అవకాశం ఇవ్వడం లేదు. భారతదేశం, ప్రజాస్వామ్యం గురించి గొప్పలు చెప్పడం మనకు బాగా అలవాటయ్యింది. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పార్లమెంట్ అధికారంలో ఉన్న ఒకరిద్దరు నేతల కనుసన్నల్లో సాగుతున్నాయి. ఎందుకిలా అన్న ఆలోచన కూడా చేయడం లేదు. ఇదేదో అధికార,విపక్షాల సమస్యగా చూస్తున్నారు. ఇక్కడ 140కోట్ల ప్రజలంతా ఆందోళనలతో ఉన్నా పట్టించుకోవం లేదు. వరదలతో దేశం మునుగుతున్నా చర్చించడం లేదు. భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మేడిపండు చందంగా మారిందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. వ్యక్తిస్వామ్యం, నిరంకుశత్వం ప్రబలిపోతోంది. పార్లమెంట్, అసెంబ్లీల్లో ప్రజల సమస్యల పై చర్చ జరగడం లేదు. అధికార విపక్షాలు కలసి ఇదేదో తమ సొంత జాగీరుగా భావించి.. సమావేశాలను నడుపుకుంటున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఇదే తంతు సాగుతోంది. బిజెపి అధికారం చేపట్టిన తరవాత అసలు సమస్యలపై చర్చ అన్నది మరచిపోయారు. సమస్య ఏదైనా పార్లమెంటులో చర్చకు రావడం లేదు. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీల్లో ఇదే పద్దతి సాగు తోంది. రాష్ట్రాల్లో కూడా అధికార పార్టీ నేతలు చర్చలకు అవకాశం ఇవ్వడం లేదు. ఇకపోతే చట్టసభల్లో చర్చించకుండానే చట్టాలు వస్తున్నాయి. చట్టసభల్లోచర్చించకుండా సమస్యలను దాట వేస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నామన్న ఆలోచనచేయడం లేదు. రాబోయే తరాలకు ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారో చెప్పడం లేదు. అధికార, విపక్షాలు తమ రాజకీయ ఎజెండాతో పనిచేయడం వల్లనే ఇలా జరుగుతోంది. ఇలా ఒక్క సమస్యపైనా చర్చించకుండా కాలం గడిపేస్తున్నారు. దేశంలో పెరుగుతున్న ధరలు, జీఎస్టీ పెంపు, వరదలు, నిరుద్యోగం లాంటి అంశాలపై చర్చించి జవాబివ్వా లని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతిపక్షాలు ప్రవేశ పెడుతున్న వాయిదా తీర్మానాలను సభాపతులు బుట్టదాఖలు చేస్తున్నారు. కనీసం సభావ్యవహారాల కమిటీ సమావేశాల్లో కూడా కీలక అంశాలపై చర్చకు సమయాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం మనస్ఫూర్తిగా ముందుకు రావడం లేదు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైనప్పుడల్లా ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రతి అంశంపై చర్చించడానికి తాము సిద్ధమని ప్రధాని మోడీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించడం ఆనవాయితీగా మారింది. తొలిరోజు ప్రధాని మోడీ కూడా సభ సజావుగా సాగాలని, ఈ సమావేశాలకు ప్రాధాన్యం ఉందని అంటున్నారు. అయితే పార్లమెంట్ సమావేశమైన తర్వాత అలాంటి సుహృద్భావ వాతావరణం మాత్రం కనపడడం లేదు. నిజంగా ఎందుకు ఇలా చేస్తున్నారో బిజెపి అగ్రనేతలు చెప్పాలి. ఎందరో కొత్త సభ్యులు పార్లమెంట్ గడప తొక్కారు. వారికి రూల్స్ కూడా తెలియకుండానే సమావేశాలు వాయిదా పడుతున్నాయి. ఈ తరహా జరుగుతున్న సమావేశాలతో ప్రజలకు ఏం సమాధానం చెబుతారో చెప్పాలి. పార్లమెంట్ సమావేశాలు జరిగినప్పుడల్లా అసలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎక్కడుందన్న అనుమానం కలుగుతుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై వారం రోజులైనప్పటికీ ఒక్కరోజు కూడా పార్లమెంట్ సరిగ్గా సాగలేదు. వాయిదా తీర్మానాలతో విపక్షాలు ఆందోళన చేస్తున్నారు. స్పీకర్లు వాయిదాలు వేస్తున్నాయి. తాజాగా పార్లమెంట్ వ్యవహారాల పరిస్థితి ఇది. పార్లమెంట్‌ను నడిపించేందుకు రాజనీతిజ్ఞత అవసరం. మనం ఉన్నదే ప్రజల కోసం అన్న కోణంలో అధికార పక్షం ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండి..సమస్యలపై చర్చించడం ద్వారా ప్రజలకు సందేశం ఇవ్వాలి. ఇలా నిరంకుశంగా వెళితే ఎంతటి వారికైనా ప్రజలు శిక్ష వేయక మానరు. మళ్లీ మాదే అధికారం అన్న అహంకార ధోరణి పనికిరాదు. పదేళ్లపాటు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ అదేరీతిలో ప్రవర్తించి ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయింది. బిజెపి కూడా ఇదే ధోరణితో సాగితే ప్రజలు కూడా చాపచుట్టినట్లు చుట్టి బంగాళాఖాతంలో విసరేస్తారని గుర్తించాలి. చట్టసభల్లో ప్రజా సమస్యలను చర్చించేందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వాలి. వారు సమస్యలను ప్రస్తావిస్తే చర్చించాలి. చర్చల ద్వారా ప్రజల మనోగతాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే చట్టసభలకు విలువ ఉంటుంది. గతంలో ఎప్పుడూ చర్చలకు ప్రాధాన్యం ఉండేది. సమస్యలపై తక్షణ చర్చలు చేపట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. చట్టసభలకు గౌరవం ఇనుమడించేలా అధికార విపక్షాలు కలిసి పనిచేయాలి. చట్టసభలను పాలకులే ఎక్కువగా గౌరవించాలి. ప్రజల సమస్యలపై చర్చించడం అలవాటు చేసుకోవాలి. ప్రజల సమస్యలపై చర్చించిన తరవాతనే విధాన నిర్ణయాలు తీసు కోవాలి. లేకుంటే ప్రజలు ఓ కంట కనిపెడుతుంటారని గుర్తించాలి. పార్లమెంటులో మంచి సంప్రదాయం నెలకొల్పేందుకు బిజెపి నేతలు ముందుకు రాకుంటే వారికి కూడా చరిత్రగుణ పాఠం చెప్పడం ఖాయం.

# తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ యూరియా వార్!



హైదరాబాద్, రాష్ట్రానికి యూరియా సరఫరా తగ్గుదల విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం నెలకొన్నది. రెండు పార్టీలు సవాళ్లు, ప్రతిసవాళు విసురుకుంటున్నాయి. రాష్ట్రంలో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా యూరియాను కేంద్రం సరఫరా చేయలేదని అధికార కాంగ్రెస్ ఆరోపిస్తోంది. బీజేపీ మాత్రం అవసరానికి మించే పంపామని చెబుతున్నది. వీళ్ల ఆరోపణలు, ప్రతిసవాళ్లు ఎలా ఉన్నా.. యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. దుకాణాల వద్ద బారులు నిలబడుతున్నారు. వర్షాలు కురిసినందున యూరియాకు మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అవసరమైన యూరియాను సరఫరా చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేశారు?

తెలంగాణలో జూలై 16 నాటికి 61,10,170 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. గత ఏడాది ఇదే సమయానికి 61,63,098 ఎకరాల్లో పలు పంటలు సాగయ్యాయి. తెలంగాణలో సాధారణ ఖరీఫ్ (వానకాలం) విస్తీర్ణం 66,41,809 ఎకరాలు. సీజన్ ప్రారంభమైన తర్వాత వర్షపాతం సరిగా నమోదు కాలేదు. రుతుపవనాల ప్రారంభంలో చెదురుమదురు వర్షాలు కురిశాయి తప్ప ఆశించినంత మేరకు లేవు. దీంతో విత్తనాలు వేసిన రైతులు వర్షం కోసం ఆకాశం వైపు చూశారు. జూలై 17 నుంచి రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. కొన్నిజిల్లాల్లో భారీ వర్షాలు కూడా నమోదయ్యాయి. ఇంకా రెండు రోజుల పాటు తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతున్నది. వర్షాలు కురవడంతో యూరియాకు ఇంకా డిమాండ్ పెరిగే అవకాశం ఉందని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. యూరియా సకాలంలో వాడకపోతే పంట దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

తెలంగాణకు ఎంత యూరియా సరఫరా చేశారు?

తెలంగాణ రాష్ట్రానికి 2024-25 ఖరీఫ్ సీజన్‌కు తెలంగాణకు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం కేటాయించింది. అయితే ఇప్పటివరకు కేటాయించిన యూరియా సరఫరా చేయలేదు. 45 శాతం యూరియా ఇంకా రాలేదని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. దీంతో రైతులు యూరియా కోసం ఇబ్బంది పడుతున్నారనేది రాష్ట్ర ప్రభుత్వం వాదన. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రాష్ట్రానికి 5 లక్షల మెట్రిక్ టన్నుల డిమాండ్ ఉంది. కానీ.. 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చాయి. దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కావాల్సి ఉందనేది ప్రభుత్వ వాదన. ఏప్రిల్ లో 1.70 లక్షల టన్నుల యూరియాకు గాను 1.22 లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయింది. ఇక మేలో 1.60 లక్షల టన్నుల యూరియా ఇవ్వాలి. కానీ, సప్లయ్ 0.88 లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయింది. జూన్ లో 5 లక్షల టన్నులు అవసరం ఉంటే.. 3.06 లక్షల టన్నులే వచ్చాయి. జూలైలో కేంద్రం 1.60 లక్షల టన్నుల యూరియా కేటాయించింది. అందులో 63వేల టన్నుల దేశీయ యూరియా, మిగిలినది విదేశాల నుంచి దిగుమతి చేసుకునేదాని నుంచి పంపుతామని తెలిపింది. అయితే ఇప్పటివరకు 29,000 టన్నులు మాత్రమే వచ్చిందని ప్రభుత్వం చెబుతున్నది. జూలై 8న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిశారు. రాష్ట్రానికి నెలలవారీగా యూరియా కేటాయింపు, సరఫరా మధ్య తేడాను వివరిస్తూ కేటాయింపు మేరకు సరఫరా చేయాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

తుమ్మలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సవాల్

యూరియా కేటాయింపు, సరఫరాలో తేడా ఉన్న విషయాన్ని కేంద్రానికి ఈ నెల 2న తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. రాష్ట్ర అవసరాల మేరకు యూరియా సరఫరా చేయాలని కోరారు. ఈ వాదనను బీజేపీ తోసిపుచ్చింది. రాష్ట్రానికి 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే కేంద్రం 12 లక్షల మెట్రిక్ టన్నులను పంపిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు చెప్పారు. దీనిపై చర్చకు తాను సిద్దమని మంత్రి తుమ్మలకు సవాల్ విసిరారు. రాష్ట్రంలో డిమాండ్ కంటే ఎక్కువ పంపినా ఎరువులు ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. దీనిపై దర్యాప్తు చేయాలని రామచందర్ రావు ప్రభుత్వాన్ని కోరారు. మరో వైపు రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయింపులో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు బాధ్యత తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మరో వైపు ఎరువుల బాధ్యత కేంద్రానిదేనని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎరువులు సరఫరా చేయకుండా రాష్ట్ర ప్రభుత్వంపై బురదచల్లేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. వ్యవసాయం గురించి ఏం తెలుసునని రామచందర్ రావు మాట్లాడుతున్నారని ఆయన ప్రశ్నించారు.

సరఫరా ఆలస్యానికి కారణం ఏంటి?

జూలైలో 1.60 లక్షలు యూరియా సరఫరా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. అయితే ఇందులో 60 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన యూరియా. ఈ యూరియా రావడానికి అవసరమైన నౌకలను కేంద్రం కేటాయించాలి. మరోవైపు తెలంగాణలో ఉన్న రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుంచి తెలంగాణకు ఇచ్చే కోటా 30,800 టన్నులు. అయితే ప్రస్తుతం ఉన్న డిమాండ్ నేపథ్యంలో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుంచి 60 వేల టన్నుల యూరియా సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. అయితే ఈ ఫ్యాక్టరీ నుంచి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఎరువులు సరఫరా చేస్తారు. దిగుమతి చేసుకున్న యూరియా కోసం అవసరమైన నౌకలు కేటాయిస్తే యూరియా సమస్య తీరిపోయే అవకాశం ఉందంటున్నారు. మరో వైపు రాష్ట్రానికి అవసరమైన యూరియా, ఎరువుల విషయంలో కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరపాలని తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సకాలంలో ఎరువులు పంటలకు వాడకపోతే తెలంగాణలోని 53.51 లక్షల హెక్టార్ల సాగు భూమిలో దిగుబడి 10-15 శాతం తగ్గుతుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరించారు.

## దళిత యువకుడి దారణ హత్య

చెన్నై,తమిళనాడులో 27 ఏళ్ల దళిత యువకుడిని దారుణంగా హత్య చేశారు. తూత్తుకుడికి చెందిన కవిన్ తిరునెల్వేలిలోని ఓ ప్రైవేటు- ఆస్పత్రి సమీపంలో హత్యకు గురయ్యాడు. కవిన్ ఒక ఐటీ- సంస్థలో పని చేస్తున్నాడు. అతడు కెటిసి నగర్‌లోని ఒక ప్రైవేటు- ఆస్పత్రిలో పని చేస్తున్న తన మాజీ స్కూల్ విద్యార్థిని రిలేషన్‌లో ఉన్నట్లు- సమాచారం. అయితే వీరిద్దరి వివాహానికి అమ్మాయి కుటు-ంబసభ్యులు అంగీకరించలేదు. కానీ, కవిన్ మాత్రం ఆ అమ్మాయినే పెళ్లి చేసుకువాలని పట్టు-దలతో ఉండేవాడు. దీంతో ఆదివారం ఆమెను కలిసేందుకు ఆమె పని చేస్తున్న ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ ఉన్న అమ్మాయి సోదరుడు సుర్జీత్.. కవిన్‌ని అడ్డుకున్నాడు. దీంతో వీరిద్దరి మధ్య కొంత సేపు వాగ్వాదం జరిగింది.

# గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ భారీ ప్రాజెక్టులు

అమరావతి,గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ భారీ ప్రాజెక్టులను చేపట్టిందని ఇందులో సింగపూర్ నుంచి మరింత సహకారాన్ని ఆశిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సింగపూర్ లో రెండో రోజు పర్యటనలో భాగంగా ఆ దేశ వాణిజ్య పరిశ్రమల శాఖలోని మానవ వనరులు, శాస్త్ర సాంకేతిక విభాగం మంత్రి టాన్ సీ లాంగ్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం భేటీ అయ్యింది. అలాగే గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్ మిషన్ కారిడార్లు, పోర్టులు తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి కోరారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన అంశంలోనూ సింగపూర్ భాగస్వామ్యం అవసరమని సీఎం చంద్రబాబు అన్నారు. లాజిస్టిక్ రంగంలో సింగపూర్ బలంగా ఉందని.. ప్రస్తుతం ఏపీలోనూ పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని సింగపూర్ మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. పోర్టులు, లాజిస్టిక్స్ రంగంలో ఉత్తమ విధానాలను అనుసరించటంలో సింగపూర్ ఏపీకి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. మానవ వనరులు, సైన్స్ అండ్ -టె-క్నాలజీ, ట్రేడ్ రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. మరోవైపు గత ప్రభుత్వం హయాంలో సింగపూర్ కంపెనీలు ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని పరిష్కరించే అంశంపై సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ తో సీఎం చర్చించారు. గతంలో జరిగిన పొరపాట్లు- పునరావృతం కాకుండా రికార్డులు సరి చేసేందుకే సింగపూర్ వచ్చానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సింగపూర్ పై ఉన్న అభిమానంతో గతంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్ నిర్మించామని చంద్రబాబు గుర్తు చేశారు. సింగపూర్ ను చూసే గతంలో హైదరాబాద్ లో రాత్రిపూట రోడ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. మరోవైపు ఏపీలో నవంబరు నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ను సీఎం ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ లో గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగంలో ఏపీతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ రంగంలో సింగపూర్ ఏపీ కలిసి పని చేస్తామని వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ, గృహనిర్మాణం లాంటి అంశాల్లో ప్రపంచ బ్యాంకుతో కలిసి పని చేస్తున్నామని సింగపూర్ మంత్రి ఏపీ సీఎంకు వివరించారు. గతంలో హైదరాబాద్ వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిశానని సింగపూర్ మంత్రి నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, నారాయణ, టీజీ భరత్ సహా ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పహల్గామ్ ఉగ్రవాదుల హతం

శ్రీనగర్,జమ్మూ కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరగింది. రెండు నెలల క్రితం పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడ్డ నలుగురిలో ముగ్గురిని భద్రతా బలగాలే ఎన్‌కౌంటర్ చేశాయి. అమాయకుమైన 26 మంది టూరిస్టుల్ని పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ, లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన 'ది రెస్టిస్టెంట్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)' ఉగ్రవాదులు చంపేశారు. ప్రకృతి అందాలను చూడటానికి వచ్చిన పర్యాటకుల్ని మతం పేరు అడుగుతూ చంపేశారు. ఈ ఘటన తర్వాత సంఘటనా స్థలం నుంచి పారిపోయారు. అయితే, ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు పాకిస్తాన్ అనుమానిత ఉగ్రవాదుల్ని జమ్మూ కాశ్మీర్‌లో సైన్యం చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ ఉగ్రవాదులు సైన్యం జరుపుతున్న ఎన్‌కౌంటర్‌లో చిక్కుకున్నట్లు- సంబంధిత వర్గాలు చెప్పాయి. హిర్వాన్ - లిద్వాస్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరుగుతోంది. గత 2 నెలలుగా ఈ ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు జమ్మూ కాశ్మీర్ వ్యాప్తంగా విస్తృతంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. 'ఆపరేషన్ మహదేవ్' పేరుతో భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం వేట మొదలుపెట్టి, ఉగ్రవాదుల్ని హతం చేశారు. భారత సైన్యం, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్), జమ్మూ కాశ్మీర్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. నివేదికల ప్రకారం, ఈ ముగ్గురు ఉగ్రవాదుల్ని భద్రతా బలగాలు మట్టు-పెట్టినట్లు- తెలుస్తోంది. అయితే, ఈ విషయం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. శ్రీనగర్‌లోని దాచిగమ్ నేషనల్ పార్క్ సమీపంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు కొనసాగాయి. కనీసం ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు చుట్టుముట్టాయి. వీరు పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులని తెలుస్తోంది.హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు- నిఘా వర్గాల సమాచారంతో నెల రోజుల నుంచి గాలింపు చేపట్టారు. చివరకు సోమవారం ఉదయం దాచిగమ్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతుండగా.. భద్రతా దళాలపైకి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గల ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయ వద్ద ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అతి సమీపం నుంచి కాల్పులు జరిపి 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ వ్యక్తి ప్రాణాలు తీశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. అప్పటి నుంచి భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నాయి. లష్కరే తయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు- ప్రాథమికంగా నిర్ధరించారు.

# పెట్టుబడులు రాకుండా అడ్డుకునే కుట్రలు

అమరావతి,ఏపీకి పెట్టుబడులు రాకుండా జగన్ అండ్ కో అడ్డుకుంటోందని.. పిల్ల సైకోల విష ప్రచారం శ్రుతి మించుతోందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. ప్రముఖ కంపెనీలు గూగుల్, టీ-సీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలు వస్తే.. వాటిపైనా దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. రాష్ట్ర భవిష్యత్తును ఐదేళ్లు నాశనం చేసిన జగన్.. నేడూ అదే ధోరణిని అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ స్కామ్, సిలికాన్ స్కామ్, శాండ్ స్కామ్, ల్యాండ్ స్కాములు బయట పడటంతో వైకాపా నేతలు రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తూ పూర్తిగా అవాస్తవాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వైకాపా నేతలు తమ కుంభకోణాల బాగోతాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని దుయ్యబట్టారు. ఈసందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పల్లా శ్రీనివాసరావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పిల్ల వైసీపీ సైకోల విష ప్రచారం సృతి మించుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి వచ్చే పెట్టుబడులను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. దెయ్యాల్లా మంచిని జీర్ణించుకోలేక గోల చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరు మారడం లేదని దుయ్యబట్టారు. నీచ రాకీయాలు, అబద్ధాలతో వైషమ్యాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి రాక్షస మూకల, సైకో దెయ్యాల కోరలు పీకి పాతాళానికి తొక్కాలని హెచ్చరించారు. అప్పుడే ప్రజలకు మనశ్శాంతి..

# వ్యవసాయం అతిపెద్ద ఉత్పాదక రంగం

న్యూఢిల్లీ,స్వవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఉంది. వ్యవసాయరంగ నిపుణులు ఇదే అభిప్రాయ పడుతున్నారు. నిరుద్యోగులు గ్రామాలకు తరలాలని, వారిని ఆదరించి వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయంరంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందిం చాలి. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపారు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటురంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని గుర్తు చేశారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని నిపునుల హెచ్చరికలు పట్టించుకోవడం లేదు. విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు, ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి.

## సింగపూర్‌లో హౌజింగ్ నిర్మాణాల పరిశీలన

అమరావతి,సింగపూర్ పర్యటనలో భాగంగా రెండోరోజు క్షేత్ర స్థాయి పర్యటనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెళ్లారు. సోమవారం సింగపూర్‌లో 10 వేల కుటుంబాలు నివాసం ఉండే బిడదారి ఎస్టేట్‌ను సీఎం బృందం సందర్శించింది. ఏపీలో భారీ ఎత్తున అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో సింగపూర్ దేశంలో అర్బన్ హౌస్ ప్లానింగ్ ఏ విధంగా ఉందనే అంశాన్ని పరిశీలించేందుకు బిడదారి ఎస్టేటును సీఎం చంద్రబాబు సందర్శించారు. సిటీ- ఇన్ ఎ గార్డెన్ పేరుతో ఏర్పాటైన హౌసింగ్ ప్రాజెక్ట్ విశిష్టతలను ముఖ్యమంత్రికి సింగపూర్ అధికారులు వివరించారు. మొత్తం 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ హౌసింగ్ ప్రాజెక్టు ప్రాంతంలో సుమారు రెండు గంటల పాటు- సీఎం చంద్రబాబు కాలి నడకన సందర్శించారు. ఈ క్రమంలో ఏపీకి సింగపూర్ దేశానికి ఉన్న అనుబంధాన్ని ఆ దేశ అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. అలాగే అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించిన ఆలోచనలను వారితో పంచుకున్నారు. కొత్త ఆలోచనలతో, ఆధునిక వసతులతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నగరాన్ని నిర్మిస్తున్నామని చంద్రబాబు అన్నారు. ఇందుకోసం ఉత్తమ విధానాలు అనుసరిస్తూ భవిష్యత్ నగరాన్ని తీర్చిదిద్దుతున్నట్టు- చెప్పారు. అమరావతి కోసం సింగపూర్ ప్రభుత్వం ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని, రాజధాని నిర్మాణంలో ప్రపంచ బ్యాంకు కూడా భాగస్వామి అవుతోందని పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఘటనల కారణంగా సింగపూర్ - ఏపీ ప్రభుత్వాల మధ్య కొంత అంతరం వచ్చిందన్న అంశాన్ని సీఎం గుర్తు చేసుకున్నారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దడంతో పాటు-.. ఉన్న గ్యాప్ ను తగ్గించేందుకు ప్రస్తుతం తాను సింగపూర్ వచ్చానని తెలిపారు. భవిష్యత్‌లోనూ సింగపూర్-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. బిడదారి ఎస్టేటులో గృహ సముదాయాల నిర్మాణం చేపట్టిన విధానాన్ని సింగపూర్ అధికారులు చంద్రబాబుకు వివరించారు. చెట్లు- తొలగించకుండా, సహజ నీటి వనరులు దెబ్బతినకుండా... ఇళ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. ప్రకృతితో మమేకమయ్యేలా చేపట్టిన ఈ నిర్మాణాల వల్ల పర్యావరణానికి హాని కలగకుండా చూసుకోవడంతో పాటు-.. ఆహ్లాదాన్ని పంచే విధంగా నిర్మాణాలు చేపట్టామని ఆ దేశ అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. గృహ సముదాయాల నిర్మాణం ఖర్చు ఏ మేరకు ఉందనే అంశం పైనా చంద్రబాబు వారితో చర్చించారు. పట్టణ, నగర ప్రాంతాల్లో అందుబాటు- ధరల్లో ఉండేలా చూడడంతో పాటు-.. నాణ్యమైన నివాస గృహాల నిర్మాణాల చేపట్టామని చంద్రబాబుకు సింగపూర్ అధికారులు చెప్పారు. బిడదారి హౌసింగ్ ప్రాజెక్టును సింగపూర్ హౌసింగ్ డెవలప్మెంట్ బోర్డు తీర్చిదిద్దిన తీరును ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. సింగపూర్ ప్రభుత్వం చేపట్టిన ఈ హౌసింగ్ ప్రాజెక్టు అన్ని వసతులతో పర్యావరణ హితంగా అద్భుతంగా నిర్మించారని చంద్రబాబు కితాబిచ్చారు. స్మశాన ప్రాంతాన్ని సుందరమైన పార్క్‌గా సింగపూర్ అర్బన్ రీడెవల్పమెంట్ అథారిటీ- మార్చడం ఆకట్టు-కుందని చంద్రబాబు అన్నారు. బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు సందర్శన అనంతరం సింగపూర్ హౌసింగ్ డెవలప్మెంట్ బోర్డు, సింగపూర్ అర్బన్ రీడెవలప్మెంట్ అథారిటీ-, సింగపూర్ కార్పొరేషన్ ఎంటర్ ప్రైజ్ సహా ప్రపంచ బ్యాంకు అధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఏపీలో చేపట్టనున్న అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టుల్లో సింగపూర్ సహకారంపై ఈ భేటీ-లో చర్చించారు.

### విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం టెండర్లు

అమరావతి, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ఏపీ మెట్రోరైలు కార్పొరేషన్ టెండర్లు పిలిచింది. ఈపీసీ విధానంలో ఈ -టె-ండర్లను ఆహ్వానించింది. ఫేజ్-1లో 38.4 కి.మీ మేర రెండు కారిడార్లలో విజయవాడ మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. కారిడార్-1లో నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం బస్టాండ్ వరకు.. కారిడార్-2లో బస్‌స్టేషన్ నుంచి పెనమలూరు వరకు మెట్రో నిర్మాణం జరగనుంది. కారిడార్-1లో 4.7 కి.మీ మేర డబుల్ డెక్కర్ ÷-లఫైఓవర్ నిర్మాణం చేపట్టనున్నారు. 32 చోట్ల మెట్రో స్టేషన్లు, ఒక చోట అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ రానుంది.

# బిసిల ఛాంపియన్ ఎవరు?



హైదరాబాద్,వెనుకబడిన కులా(బిసి)లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కంకణబద్ధుడై ఉన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఈ బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదింపజేసి కేంద్రానికి పంపించింది. ఈ బిల్లు విద్య, ఉద్యోగావకాశాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల అంశానికి ముడిపడి ఉంది. కేంద్రంలో బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఈ బిల్లుకు అంత తేలిగ్గా ఆమోదం పొందదని భావించిన రాష్ట్ర మంత్రివర్గం మరో అడుగు ముందుకేసి ఆర్డినెన్స్ (ముసాయిదా)కు ఆమోదం తెలిపి గవర్నర్‌కు పంపించింది. ఈ ఆర్డినెన్స్ ముసాయిదాకు గవర్నర్ ఆమోద ముద్ర వేసినట్లయితే ఆర్డినెన్స్ కాలపరిమితి ఆరు నెలలు కాబట్టి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేయాలని ముఖ్యమంత్రి భావన.అయితే బిల్లు కేంద్రానికి పంపించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మనే అదే రిజర్వేషన్ల అంశానికి సంబంధించి తన ముందుకు వచ్చిన ఆర్డినెన్స్‌కు ఆమోదం (%రాజూ-జూతీశీఝుశ్రీ శీతీఎఆఖుఅషెవ%) తెలుపడానికి వెనుకాడక తప్పలేదు. ఎందుకంటే కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగా, అదే అంశంపై ముసాయిదా ఆర్డినెన్స్‌కు ఎలా క్లియరెన్స్ ఇవ్వగలరన్నది ప్రశ్న. దీంతో గవర్నర్ న్యాయ నిపుణుల సలహా తీసుకున్నారు. అంతేకాకుండా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకూ పంపించారు. తాను ముసాయిదా ఆర్డినెన్స్‌కు క్లియరెన్స్ ఇస్తే ఎదురయ్యే న్యాయ, చట్టపరమైన చిక్కులు ఏమైనా ఎదురవుతాయా? అనే సందేహాలను వ్యక్తం చేశారు. దీనిపై కేంద్రం నుంచి ఇంకా సమాధానం రావాల్సి ఉంది. మరోవైపు సెప్టెంబర్ నెలాఖరులోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్న రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగంలోని 9వ షెడ్యూలును కేంద్రం సవరించాల్సి ఉంటుంది. ఈ సవరణ జరిగితే మిగతా రాష్ట్రాల్లోనూ రిజర్వేషన్ల అంశం తెరపైకి వస్తుంది.బీహార్ రాష్ట్ర ప్రభుత్వం లోగడ అరవై శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రయత్నించగా, సుప్రీం కోర్టు బ్రేక్ వేసింది. తమిళనాడు ప్రభుత్వం 62 శాతం రిజర్వేషన్లు కల్పిస్తుంది కదా అనే సందేహాలూ లేకపోలేదు. కానీ రిజర్వేషన్ల చట్టం అమలులోకి రాక ముందే అన్నామలై కాలంలో రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి. కాబట్టి ఆ రాష్ట్రంతో పోల్చుకోవడానికి వీల్లేదు. తమిళనాడు ప్రభుత్వం తాజాగా మూడు బిల్లులను గవర్నర్ ఆమోదం లేకుండానే అమలులోకి తీసుకుని వచ్చింది. చట్ట సభలు ఆమోదించి పంపించే బిల్లులకు గవర్నర్, రాష్ట్రపతి మూడు నెలల్లోగా ఆమోదం తెలపకపోతే అవి గడువు ముగియగానే చట్టాలుగా మారుతాయని సుప్రీం కోర్టు ధర్మాసనం చెప్పడంతో మూడు బిల్లులను గవర్నర్ ఆమోదం లేకుండానే చట్టాలుగా అమలు చేస్తున్నది. రేవంత్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని ఎఐసిసి అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహులు గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రభృతులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. దీంతో రేవంత్ బిసి ఛాంపియన్‌గా చరిత్రలో నిలబడతారన్న ప్రచారమూ ఊపందుకుంది.కాగా, వెనుకబడిన కులాలను ఆకర్షించడంలో వెనుకబడి పోతున్నామని బిజెపి రాష్ట్ర నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ బిసిలను హైజాక్ చేసిందని, దీనిని అధిగమించి బిసిలను తమ వైపు తిప్పుకోవడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని బిజెపి భావిస్తోంది. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన కూడా చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించడం గొప్ప విషయమైనా, ఈ ప్రక్రియ పూర్తి కావడానికి సమయం పడుతుంది కాబట్టి ఈలోగా ఒక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని బిజెపి నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల నగరంలోని ఒక హొటల్‌లో బిజెపి ఒబిసి మోర్చా సమావేశమై తర్జన-భర్జన పడింది. బిజెపి రథసారథిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎన్.రామచందర్ రావు రెండు రోజుల క్రితం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ బిసి బిల్లు ఆమోదం పొందడం అంత తేలికయ్యే పని కాదని, దీనికి రాజ్యాంగం లోని తొమ్మిదవ షెడ్యూలును సవరించాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా బిల్లును కేంద్రానికి పంపించి నెపం కేంద్రంపై వేసి, రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ చూస్తున్నదని తూర్పారబట్టారు. దీనిని కాంగ్రెస్ తీవ్రంగా ఆక్షేపించింది. బిసి బిల్లుకు కేంద్రం ఆమోదం తెలపదన్న సంకేతాన్ని రామచందర్ రావు ఇచ్చారన్న అనుమానాన్ని కాంగ్రెస్ వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం బిసి బిల్లు బంతిని కేంద్రం కోర్టులోకి వేసినందున, కేంద్రం తీసుకునే నిర్ణయంపై కూడా బిజెపి రాష్ట్ర నాయకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కేంద్రం నో చెబితే ఇక్కడ బిజెపికి చాలా సమస్య ఎదురవుతుంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు చట్ట సవరణ చేసి బిసిలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పిస్తే బాగుంటుందన్న భావన, ఆశ బిజెపి రాష్ట్ర నాయకులకు ఉన్నా అంత తేలికయ్యే అంశమేమీ కాదు.దానికి ఎన్నో అవాంతరాలు రాకతప్పదు. సుప్రీం కోర్టు ఇప్పటికే యాభై శాతం రిజర్వేషన్లు దాట రాదని ఆదేశించింది. అలా చేస్తే ఇతర కులాల నుంచి వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వస్తుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలైనా, మరే ఏ ఎన్నికలైనా బిసిల ఓట్లే కీలకం కాబట్టి అన్ని పార్టీలూ బిసి అజెండాతో జెండాలు పైకెత్తి ముందుకు సాగుతున్నాయి. బిల్లు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఆమోదించేలా చర్యలు చేపట్టాలని బిఆర్‌ఎస్ నేతల డిమాండ్. కాంగ్రెస్ ఆ దిశగా చర్యలు చేపట్టకుండా సభలు, సమావేశాలు, ప్రెస్ కాన్ఫరెన్స్‌లతో కాలయా పన చేస్తున్నదన్న విమర్శల దాడి చేస్తున్నది. ఈ బిల్లును చట్టంగా చేయాలంటూ కోరుతూ బిసి బిల్లును కేంద్రం కోర్టులోకి నెట్టి వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతమైందని చెప్పవచ్చు. దీంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాలని నిర్ణయించింది .కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టినప్పుడే బిసిల దయ నీయమైన పరిస్థితిని చూసి తాము అధికారంలోకి రాగానే బిసిలకు సరైన గుర్తిం పు ఇచ్చేందుకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు ఢంకా భజాయించి చెబుతున్నారు. అయితే కేంద్రంలో అధికారంలోకి రాలేకపోవడంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాహుల్ ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా ప్రయత్నించారన్నది స్పష్టమవుతున్నది. బిసి రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రం చట్టంగా మార్చకపోతే నెపం ఎన్‌డిఎపైనే పడుతుంద న్నది మరో వాదన. ఎన్నికల సమయంలో నెపం కేంద్రంపై వేసేలా కాంగ్రెస్‌కు ఓ అస్త్రం సిద్ధమైంది. దీనిని తిప్పికొట్టేందుకు బిజెపికి ఇప్పుడు ఆయుధం కావాలి. కాబట్టి జనగణనతో పాటు కులగణనకు శ్రీకారం చేపడతామని ప్రకటించింది. రేవంత్ రెడ్డి కదిలించిన బిసి బిల్లు తేనె తుట్టె అన్ని పార్టీలనూ ఇరకాటంలో పెట్టింది.

### 80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్లు

శ్రీకాకుళం,ఆరుగాలం శ్రమించే రైతులకు వ్యవసాయాన్ని సులభతరం చేయాలని దేశంలోనే తొలిసారిగా కూటమి ప్రభుత్వం 80 శాతం రాయితీపై రైతులకు డ్రోన్లు అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో సోమవారం వ్యవసాయానికి ఉపయోగించే డ్రోన్ ను ప్రారంభించి, డ్రోన్ పనితీరును పరిశీలించి, నందిగాం మండలం నరేంద్రపురం రైతులకు డ్రోన్ ను పంపిణీ చేశారు.

# ఇజ్రాయెల్‌ను ఒంటరి చేయడమే ఏకైక మార్గం!



ఇజ్రాయెల్,గాజాలో ఇజ్రాయెల్ సామూహిక నరమేధానికి పాల్పడుతున్నది. ఒకజాతి మొత్తాన్ని సంహరించేలా చిన్నారులు, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా రోజుకు వందలాది మందిని హత్య చేస్తున్నది. మానవతా సహాయం, ఆహారం, వైద్య కోసం ఎదురుచూస్తున్న వారిపై సైతం బుల్లెట్లు, బాంబుల వర్షం కురిపిస్తున్నది. దీంతో 2023 అక్టోబర్ నుంచి సుమారు 60-80 వేల మంది వరకు మరణించారని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ, నేచర్ నివేదికల ద్వారా స్పష్టమవుతున్నది. ఇందులో సుమారు 18 వేల మంది చిన్నారులు ఉండగా, 15 వేల కంటే ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. రెండు వేల మంది వరకు వృద్ధులు ఉన్నట్టు అంచనా. గాజాలో మరణించిన వారిలో 59.1 శాతం మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఉన్నారని లాన్సెట్ ఒక నివేదికలో స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ విధించిన దిగ్బంధం వల్ల ఆహారం, నీరు, ఇంధనం, వైద్య సామాగ్రి వంటి ప్రాథమిక అవసరాలు కూడా గాజాకు అందడం లేదు.దీనివల్ల ఆకలి చావులు, వ్యాధులు విస్తరిస్తున్నాయి. ఇప్పటికే వందలాది మంది ఆకలితో మరణించినట్టు పలు రిపోర్టుల ద్వారా తెలుస్తున్నది. ఇందులోనూ 80 శాతం మంది చిన్నారులు ఉండడం మనసులను కలచివేస్తున్నది. గత కొన్ని రోజుల్లో ఆహార సహాయ కేంద్రాల వద్ద ఇజ్రాయెల్ సైనికులు జరిపిన కాల్పుల్లో 875 సాధారణ మంది పౌరులు మరణించారని ఐక్యరాజ్య సమితి (%ఖఅఫ్వఎ చీఫ్‌ఊశీఅం%) నివేదించింది. అంతేకాకుండా సుమారు 19 లక్షల మంది నిర్వాసితులుగా మారారు. ఈ నేపథ్యంలో యుద్ధాన్ని వెంటనే ఆపాలని, మానవతా సహాయానికి అనుమతించాలని ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఇటీవల 28 దేశాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి.ఇందులో ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఎస్టోనియా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, ఐస్‌లాండ్, ఐర్లాండ్, ఇటలీ, జపాన్, లాట్వియా, లిథువేనియా, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, నార్వే, పోలాండ్, పోర్చుగల్, స్లోవేనియా, స్పెయిన్, స్వీడన్, స్విట్జర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్, గ్రీస్, మాల్టా, సైప్రస్ దేశాలు ఉన్నాయి.కాగా, వీరి డిమాండ్‌ను ఇజ్రాయెల్ తిరస్కరించింది. దీన్ని బట్టి చూస్తే ఈ 28 దేశాలు ప్రకటనలకే పరిమితమైతే ఎలాంటి లాభం ఉండదని స్పష్టమవుతున్నది. ఇజ్రాయెల్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చేందుకు ఆ దేశాన్ని ఒంటరిచేసేలా కఠిన ఆంక్షలు విధించాల్సిన అవసరమున్నది. గాజాలో యుద్ధ విరామం, మానవతా సహాయం అందేలా ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చేలా ఇప్పటికే పలు దేశాలు చర్యలు మొదలుపెట్టాయి. ఇజ్రాయెల్ చర్యల కారణంగా వాణిజ్య ఒప్పందాన్ని సమీక్షించాల్సిన అవసరముందని ఇయు విదేశాంగ విధాన ప్రధాని కాజా కల్లాస్ ప్రకటించారు.యుకె ఇప్పటికే ఇజ్రాయెల్‌తో వాణిజ్య చర్చలను నిలిపివేసింది. ఇజ్రాయెల్‌కు ఆయుధ బదిలీలు ఆపాలని యుఎన్ నిపుణులు సైతం హెచ్చరించారు. యుకె, మరికొన్ని దేశాలు ఆయుధ లైసెన్సులను కొంతవరకు నిలిపివేశాయి. బెలిజ్ ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను నిలిపివేసింది. ఐర్లాండ్, నార్వే, స్లోవేనియా, స్పెయిన్ 2024లో పాలస్తీనాను దేశంగా గుర్తించాయి. యుఎన్ జనరల్ అసెంబ్లీలో పాలస్తీనాను ఒక దేశంగా గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యూయెల్ మాక్రోన్ కూడా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గాజాలో యుద్ధాన్ని ఆపడానికి, మానవతా సంక్షోభాన్ని నివారించడానికి ఇది చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. అంటే ఫ్రాన్స్ జి7 దేశాల్లో పాలస్తీనాను దేశంగా గుర్తించే మొట్టమొదటి రాజ్యంగా నిలవనుంది. గాజాలో నరమేధాన్ని నిరోధించేలా చర్యలు తీసుకోవాలని ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ ఇప్పటికే ఇజ్రాయెల్‌ను ఆదేశించింది.యుద్ధ నేరాలకు గాను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ, మాజీ రక్షణ మంత్రి యోవ్ గల్లంట్ పై ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఇజ్రాయెల్ పై కఠిన ఆంక్షలు విధించడం ద్వారానే ఆ దేశంపై ఒత్తిడి తీసుకురావచ్చు. ముందుగా ఆయుధాల ఎగుమతులపై పూర్తి నిషేధం విధించాలి. పాలస్తీనాకు దేశ గుర్తింపును ఇవ్వడం ద్వారా దీర్ఘకాలిక మద్దతు అందించవచ్చు. ఐసిజె, ఐసిసి వంటి అంతర్జాతీయ న్యాయస్థానాల్లో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూపై మరిన్ని కేసులు వేసి చట్టపరమైన చర్యలకు డిమాండ్ చేయొచ్చు. గాజాలో 92% గృహాలు, 88% పాఠశాలలు ధ్వంసమయ్యాయని యుఎన్ నివేదికలు స్పష్టం చేశాయి. ప్రపంచ దేశాలు గాజా పునర్నిర్మాణానికి నిధులను కేటాయించడం ద్వారా దీర్ఘకాలిక సహాయాన్ని అందించవచ్చు.ఇది విద్య, ఆరోగ్యం, జీవనోపాధికి దోహదపడుతుంది.మరోవైపు అన్ని దేశాల ప్రజలు సైతం ఇజ్రాయెల్ పై ఒత్తిడి పెంచే చర్యలకు సిద్ధం కావాల్సిన అవసరమున్నది. ఇప్పటికే అనేక దేశాల్లో పాలస్తీనాకు మద్దతుగా ప్రజలు ఉద్యమిస్తున్నారు. ఇది ఆయా దేశాలు తీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేయగలవు. బాయ్ కాట్, డైవెస్ట్‌మెంట్, శాంక్షన్స్ (బిడిఎస్) ఉద్యమం ద్వారా ఇజ్రాయెల్‌తో వాణిజ్య ఒప్పందాలను సమీక్షించాలని యూరోపియన్ దేశాలను కోరుతున్నారు. రఫా క్రాసింగ్ ద్వారా ఆహారం, నీరు, వైద్య సామాగ్రిని గాజాకు చేరవేయడానికి ఈజిప్ట్‌తో సమన్వయం చేసుకోవాల్సిన అవసరముంది. 28 దేశాల సంయుక్త ప్రకటన గాజా సంక్షోభాన్ని ఖండించడంలో ఒక ముఖ్యమైన అడుగు. కానీ ఇది కేవలం మౌఖిక సందేశంగా మిగిలిపోకూడదు. గాజాలో నిరాయుధులు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, ఆకలి చావులు, మానవతా సంక్షోభాన్ని నివారించడానికి ఈ దేశాలు ఇజ్రాయెల్‌పై ఆంక్షలు విధించే ధైర్యం చేయాలి. అప్పుడే గాజా ప్రజలకు న్యాయం సాధ్యమవుతుంది.

# రాజకీయ నిరంకుశం ప్రమాదం

న్యూఢిల్లీ,అధికారం శాశ్వతమని ఏ రాజకీయ పార్టీ అయినా అనుకుంటే పొరపాటు. వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ కూడా పాటించకుంటే మట్టికరచి పోతాయని గతంలో అనేక సందర్భాల్లో చూశాం. ఎన్టీఆర్ లాంటి వారు కూడా ప్రజాగ్రహంలో కొట్టుకు పోయారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఏపిలో జగన్, తెలంగాణలో కెసిఆర్ అడ్రస్ లేకుండా పోయారు. ప్రజలు ఛీదరించుకుంటే ఎంతటి వారైనా మట్టి కరవాల్సిందే. బెంగాల్లో కమ్యూనిస్టులు ఇదే ధోరణిలో 30ఏళ్లపాటు రాజ్యమేలారు. తమకు తిరుగు లేదన్న ధోరణిలో వారు ప్రజల ఆశలను, ఆకాంక్షలను పట్టించు కోలేదు. తమ నిరంకుశ పాలనకు ప్రజాస్వామ్యం, అభివృద్ధి ముసుగేసారు. కానీ అక్కడా మమతా బెనర్జీ లాంటి వారు పుట్టుకుని వచ్చారు. కమ్యూనిస్టులను కూకటి వేళ్లతో పెకిలించారు. అయితే ఆమె కూడా అదే ధోరణిలో నిరంకుశ పాలన సాగించడంతో ఇప్పుడు మమతా బెనర్జీ పునాదులు కూడా కదులుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభివృద్ధిని పక్కన పెట్టి బుజ్జగింపురాజకీయాలను చేస్తున్నారు. తెలంగాణలో ఇలాగే ఓటమికి ఓ రకంగా అది కెసిఆర్ వైఫల్యంగానే చూడాలి. ప్రజల్లో నిరసనలు నివురుగప్పితే నాయకుడనేవాడు ఏ పార్టీలో అయినా పుట్టుకుని వస్తారని గమనించాలి. అప్పుల కుప్ప చేసి పథకాలను ప్రకటించి ప్రజలను ఓట్ల రూపంలో మలచుకోవడంలో అధికార పార్టీ నేతలు ఆరితేరారు. దీంతో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. ఈ అప్పులు ఇప్పుడు తీర్చే శక్తి కూడా రాష్ట్రాలకు లేకుండా పోతున్నది. అందుకే ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. కెసిఆర్ జగన్ ఇద్దరూ తమ ఇష్టం వచ్చినట్లుగా ముందుకు సాగుతూ ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకుండా, కేవలం తన సొంత నిర్ణయాలతో మభ్యపెట్టే ప్రయత్నాలు చేశారు. అప్పులతో రాష్ట్రాలను కోలుకోకుండ చేశారు. అధికారంలో ఉన్నవారు అన్నింటికీ మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు మంచిది కాదు. ప్రజల్లో గూడు కట్టుకుంటున్న అసంతృప్తిని పసిగట్టడంలో నేతలు విఫలమవుతున్నారు. బిఆర్‌ఎస్ పార్టీలో ప్రజాస్వామ్యాన్ని మచ్చుకు కూడా కనిపించకుండా అంతా తామే అన్నట్టుగా కెసిఆర్, కెటిఆర్ వ్యవహారాలు నడుపుతున్నారు. అధికారం అంతా ఒక కుటుంబం వద్దనే కేంద్రీకృతమై ఉంటే జరిగే అనర్థాలకు జగన్, కెసిఆర్‌లు ప్రత్యక్ష ఉదాహరణలు. క్షేత్రస్థాయిలో ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా మీడియాను దూరం పెట్టారు. కేసీఆర్, జగగన్‌లు చిన్నపాటి విమర్శలను కూడా స్వీకరించలేని స్థితికి చేరుకున్నారు. ఫలితంగా ప్రజల మనోభావాలను తెలియ జేయడానికి పార్టీలో కూడా ఎవరూ సాహసించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వీరిద్దరూ ఇప్పుడు ప్రతిపక్షానికి కూడా పనికి రాకుంఆ పోతున్నారు.

## ప్రపంచాన్ని వణికిస్తున్నహెపటైటిస్

న్యూఢిల్లీ,పంచ కాలేయ వ్యాధి (హెపటైటిస్) దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించి ఈ రోజున సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించింది. దీంతో ప్రతియేటా జూలై 28న ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవాన్ని జరుపుకొంటున్నాము.హెపటైటిస్ బీ వైరస్ను కనుగొన్న నోబెల్ గ్రహీత బరూచ్ శామ్యూల్ బ్లంబర్గ్ కు గుర్తుగా ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఈ రోజును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కాలంలో ఉన్న పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, జీవన విధానాలు, ఉద్యోగంలో ఒత్తిళ్లు, మానసిక ఒత్తిళ్లు, నిద్రలేనితనం తదితర కారణాలతో మనిషి ఎన్నో వ్యాధుల బారిన పడుతున్నాడు. ఇందులో హెపటైటీస్ వ్యాధి. ఇది చాలా ప్రమాదకరమైనది. ఇది శరీరంలోని కాలేయం (లివర్)పై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఏ,బి,సి,డి,ఇలు వెలుగు చూసిన ఈ వ్యాధిలో హెపటైటీస్ వ్యాధి చాలా ప్రమాదకరమైనదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి తీవ్రత సిర్రోలిక్ దశకు చేరుకుని ఏకంగా కాలేయం పూర్తిగా దెబ్బతింటుంది. ఈ దశలోకాలేయం మార్పిడి చేయాల్సి వస్తుంది. అందుకు వ్యాధి బారినపడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది..కాలేయ వ్యాధి ఎక్కువగా ఎవరికి వస్తుంది. ఈ వ్యాధి అధికంగా మద్యం సేవించే వారికి వస్తున్నట్లు తెలుస్తోంది. శరీరంలో చేరే మద్యాన్ని విసర్జించే క్రమంలో కాలేయం ఎక్కువగా శ్రమకు గురవుతుంది. కాలేయం సామర్థ్యానికి మించి మద్యం సేవించినట్లయితే కాలేయ మెల్లమెల్లగా దెబ్బతింటుంది. ఫలితంగా ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్, ఆల్కహాలిక్ హెపటైటీస్ ఆల్కహాలిక్ సిర్రోసిస్ వ్యాధులు దరిచేరుతాయి. ఆల్కహాలిక్ ఫ్యాటి లివర్ డిసీజ్‌లో కాలేయం కణాల్లో కొవ్వు పేరుకుపోతుంది. అలాగే కాలేయం పనితీరు సక్రమంగా ఉన్నా.. ఎంజైమ్ విడుదలలో హెచ్చు తగ్గులు చోటు చేసుకుంటాయి.ఈ పరిస్థితిని మద్యం మానేసి సరిదిద్దుకోవాలి. అతిగా మద్యం సేవించే వారి కాలేయం వాపునకు గురై గట్టిగా తయారవుతుంది. దీనినే ఆల్కహాలిక్ హెపటైటీస్ అంటారు.ఈ వ్యాధితో కాలేయం పనితీరు క్రమంగా అదుపు తప్పుతుంది. వ్యాధి తీవ్రత పెరిగితే కాలేయం విఫలమవుతుంది. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, వైరస్‌ల వల్ల కాలేయం కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది..లివర్ క్యాన్సర్ ముప్పుహెపటైటిస్ ఇన్‌ఫెక్షన్ లివర్ క్యాన్సర్‌కు కూడా దారి తీసే అవకాశం ఉంది. సాధారణ కాలేయ క్యాన్సర్‌ను హెపటో సెల్యూలార్ క్యాన్సర్ అని అంటారు. దీర్ఘకాలికంగా ఆల్కహాల్ తీసుకునే వారికి ఈ వ్యాధి ఏర్పడుతుంది. దీన్ని కడుపు పైభాగంలో నొప్పితో పాటు బరువు తగ్గడం వంటి లక్షణాలతో గుర్తించవచ్చు. పసిరికలు, నీళ్ల విరేచనాలు వంటి లక్షణాలు కూడా కనిపిస్తుంటాయి. ప్రాథమికంగా రక్తపరీక్ష (ఏఎఫ్‌బీ), అల్టా సౌండ్ పరీక్షలతో గుర్తించవచ్చు. అవసరాన్ని బట్టి సీటీ స్కాన్, ఎండోస్కోపీ, బయాప్సీ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది.'వన్ లైఫ్, వన్ లివర్'.ఈ సంవత్సరం 2023, ప్రపంచ హెపటైటిస్ డే థీమ్ ' వన్ లైఫ్, వన్ లివర్ '. వైరల్ హెపటైటిస్ నివారణ, రోగనిర్ధారణ మరియు చికిత్సను మెరుగుపరచడానికి అవసరమైన కొలతలను వేగవంతం చేయడానికి, తద్వారా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు ప్రపంచవ్యాప్తంగా 2030 హెపటైటిస్ నిర్మూలన లక్ష్యాలను సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా కృషి చేస్తున్నారు.

## కాస్తైనా ఏమీ అనిపించదా?

సెంట్రల్ డెస్క్:ఎవరు ఎన్ని చెప్పినా.. ఎవరు ఎంత చెప్పినా.. వాస్తవం ఏమిటో తనకు పూర్తిగా తెలిసినా.. ట్రంప్ మాత్రం మారడం లేదు! తనకు అనిపించింది చెప్పుకుంటూ, చేసుకుంటూ పోతున్నారు! నవ్విపోదురు గాక నాకేటి అన్నట్లుగా ట్రంప్ వ్యవహారశైలి ఉందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ మరోసారి భారత్ - పాక్ మధ్య జరిగిన యుద్ధం గురించి ప్రస్థావించారు!అవును. మొన్న భారత్ - పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని.. ఇటీవల ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య యుద్ధం ఆగడానికి తానే కారణమని.. అయినప్పటికీ తనకు నోబె ల్ శాంతి బహుమతి రాదని చెప్పుకుంటున్న ట్రంప్.. శాంతి బహుమతి ప్రేమతో గెలిస్తే వస్తుంది తప్ప.. బెదిరించో, బలవంతం పెట్టో చేయిస్తే రాదనే విషయాన్ని మరిచిపోతున్నారనే మాటలకు అవకాశం ఇస్తున్నారు!ఈ క్రమంలో తాజాగా థాయిలాండ్ - కంబోడియా దేశాల మధ్య మొదలైన ఘర్షణపై స్పందించారు. ఈ సమయంలో కాల్పుల విరమణ చర్చలకు తక్షణమే అంగీకరిం చారని ప్రకటించారు. తాను కంబోడియా ప్రధాని హున్ మానెట్, థాయ్ ప్రధాని ఫుమ్థామ్ వెచియాచైతో మాట్లాడినట్లు చెప్పిన ట్రంప్.. వారు యుద్ధం కొనసాగిస్తే..

# మోడీకి మంట పెడుతున్న ట్రంప్ సెల్ఫ్ గోల్!



న్యూఢిల్లీ,ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి.. అమెరికా అధ్యక్షుడు మిత్రుడు. ఇద్దరూ కూడా అనేక సందర్భాల్లో ఈ మాట చెప్పుకొచ్చారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో మోడీ కూడా.. ట్రంప్ విజయం దక్కించుకో వాలని కోరుకున్నట్టు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. అయితే.. మోడీకి ఇప్పుడు ఆ మిత్రుడే కంట్లో నలుసుగా మారారు. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాల్లో.. ఆపరేషన్ సిందూర్‌పై 16 గంటల సుదీర్ఘ చర్చ సాగుతోంది సోమవారం లోక్‌సభలో ప్రారంభమైన ఈ చర్చ.. వాయిదాల పర్వంతో ముందుకు సాగుతోంది.మంగళవారం రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్.. అనంతర పరిణామాలపై చర్చ చేపట్టనున్నారు. ఈ సభలో కూడా 16 గంటల పాటు చర్చ సాగనుంది. అయితే.. ఈ కీలక సమయంలో ట్రంప్ అధికార పక్షాన్ని ఇరకాటంలో పడేసేలా.. ప్రతిపక్షాలకు మరిన్ని ఆయుధాలు ఇచ్చేలా వ్యాఖ్యానించారు. తానే లేక పోతే.. పాకిస్థాన్–భారత్ మధ్య ఇప్పటికీ యుద్ధం జరుగుతూనే ఉండేదని.. తానే ఇద్దరినీ నిలువరించానని.. చెప్పారు. అంతేకాదు.. వాణిజ్య ఒప్పందాలు పునః సమీక్షించడంతోపాటు.. సుంకాలు మరింత బాదుతానని చెప్పడంతోనే ఇరు దేశాలు వెనక్కి తగ్గాయన్నారు.వాస్తవానికి ఈ వ్యాఖ్యలు.. ఇప్పుడు కొత్తగా చేయకపోయినా.. గత నుంచి కూడా ట్రంప్ ఇదే చెబుతున్నారు. ఆపరేషన్ సిందూర్ కు సంబంధించి కాల్పుల విరమణను భారత్–పాక్ ప్రకటించడానికి ముందే.. ట్రంప్ ప్రకటించారు. ఇది పెను దుమారంగా మారింది. అందుకే.. మోడీ సర్కారుపై విపక్షాలు దుమ్మెత్తిపోసి.. చర్చకు పట్టుబట్టడంతో.. ఇప్పుడు పార్లమెంటు ఉభయ సభలు కూడా.. గతంలో ఎన్నడూ లేని విధంగా 16 గంటల చొప్పున కేటాయించి.. చర్చ చేపట్టాయి. ఇలాంటి కీలక సమయంలోనూ.. ట్రంప్ మరోసా రి ఈ వాదన వినిపించడంతో ప్రతిపక్షాలకు మరిన్ని ఆయుధాలు ఇచ్చినట్టు అయింది.ఒకవైపు.. ఆపరేషన్ సిందూర్‌ను సమర్థించుకునేందుకు.. పాక్ ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టేందుకు తాము ప్రయత్నించామని ప్రభుత్వం చెబుతుంటే.. అసలు దీనిలో ట్రంప్ ప్రమేయం ఏంటని.. దీనిపై చర్చకు రావాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. సరిగ్గా ఈ సమయంలోనే మరోసారి ట్రంప్ తన ప్రమేయంతోనే.. యుద్ధంవిరమించారని వ్యాఖ్యానించారు. మరి ఆయన భారత్‌లో చర్చ జరుగుతోందని తెలిసి వ్యాఖ్యానించారో.. లేక సెల్ఫ్ గోల్ చేసుకునే ప్రయత్నమో ఏదైనా కానీ.. ప్రధాని మోడీకి మాత్రం ఇబ్బందిగానే మారిందని చెప్పాలి.

# వరంగల్.. హన్మకొండ జిల్లాలు ఒక్కటిగా.. ఎందుకు?



వరంగల్:పక్కపక్కనే కాదు.. ఒక విధంగా ఒకే శరీరానికి ఉండే రెండు చేతుల మాదిరి ఉండే ప్రాంతాల్ని రెండు జిల్లాలుగా ముక్కలు చేస్తే వచ్చే ఇబ్బందులన్న మాటకు నిలువెత్తు రూపంగా ఉంటుంది వరంగల్.. హన్మకొండజిల్లాల ముచ్చట. కేసీఆర్ హయాంలో భారీ ఎత్తున కొత్త జిల్లాల్ని ఏర్పాటు చేసిన క్రమంలో జంట నగరాలుగా ఉన్న ప్రాంతాన్ని రెండు జిల్లాలుగా మారుస్తూ తీసుకున్న నిర్ణయంతో విపరీతమైన గందరగోళంతో పాటు.. రోజువారీ అంశాలకు సైతం సమస్యగా మారిన దుస్థితి.అదెంతలా అంటే.. వరంగల్ జిల్లా కలెక్టరేట్ తో పాటు ఇతర ముఖ్యమైన కార్యాలయాలన్నీ హన్మకొండలో ఉండగా.. వరంగల్ జిల్లా వాసులు కలెక్టర్ ను కలిసేందుకు పక్క జిల్లా అయిన హన్మకొండకు రావాల్సిన పరిస్థితి. అంతేకాదు.. వరంగల్.. హన్మకొండ జిల్లా కార్యాలయాలు సైతం పక్కపక్కనే ఉంటాయి. ఇలాంటప్పుడు రెండు జిల్లాల అవసరం ఏమిటి? ఈ ప్రశ్నల పరంపర అంతకంతకూ ఎక్కువ కావటమేకాదు.. కలిసి మెలిసి ఉన్న రెండు ప్రాంతాల్ని రెండు జిల్లాలుగా చేయటాన్ని పలువురు తప్పు పడుతున్న పరిస్థితి.ఇలాంటి వేళ.. ఈ రెండు జిల్లాల్ని గతంలో మాదిరి.. ఒకే జిల్లాగా మార్చాలన్న డిమాండ్ అంతకంతకూ ఎక్కువ అవుతోంది. ఈ మధ్యన నిరసనలు కూడా మొదలయ్యాయి. రెండు జిల్లాల్ని మళ్లీ కలపాలంటూ కాకతీయ వర్సిటీ ప్రొఫెసర్లు.. విద్యార్థులు.. విద్యావంతులు.. వివిధ పార్టీ నేతలు ఉద్యమానికి శ్రీకారం చుట్టటం తెలిసిందే.గులాబీ నేతలు తమ పదవులు.. వ్యాపారాల కోసం ఘన చరిత్ర ఉన్న వరంగల్ నగరాన్ని రెండుగా విభజించి.. డెవలప్ కాకుండా కుట్ర చేశారన్న ఆరోపణలతో తెలంగాణ ఉద్యమ వేదిక.. ఫోరం ఫర్ బెటర్ వరంగల్ ఆధ్వర్యంలో సదస్సులు.. చర్చా వేదికలు నిర్వహిస్తున్నారు. దీనికి పెద్ద ఎత్తున సానుకూల స్పందన వస్తుండటం గమనార్హం. రోజువారీ కార్యకలాపాల విషయంలోనూ ప్రజలు ఇబ్బంది పడుతున్న పరిస్థితి. దీంతో.. రెండు జిల్లాల్ని ఒకటి చేయాలన్న డిమాండ్ కు మద్దతు పెరుగుతోంది.దీనికి తోడు ఎన్నికల ముందు వరంగల్.. హన్మకొండ జిల్లాల్ని ఒకటి చేస్తామని కాంగ్రెస్ చెప్పటం.. ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రెండేళ్లు అవుతున్నా.. ఇప్పటికి హామీని అమలు చేయని వైనంపై రేవంత్ ప్రభుత్వాన్ని పలువురు తప్పు పడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వరంగల్ జిల్లాలో హన్మకొండ జిల్లాని విలీనం చేయాలన్న డిమాండ్ ను మరింత తీవ్రం చేయాలని భావిస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఆచితూచి అన్నట్లు వ్యవహరిస్తోంది. కేసీఆర్ ప్రభుత్వం మాదిరి తాము సైతం తొందరపడి నిర్ణయం ప్రకటించకుండా.. ప్రజల మద్దతు పెద్ద ఎత్తున ఉన్న కారణంగానే రెండు జిల్లాల్ని ఒకటిగా చేయాలన్న నిర్ణయాన్ని ప్రకటించాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.చారిత్రాత్మక వరంగల్ జిల్లాను వరంగల్ అర్బన్.. వరంగల్ రూరల్.. మహబూబాబాబద్.. జయశంకర్ భూపాలపల్లి.. జనగామ జిల్లాగావిభజించటం తెలిసిందే. 2019 ఫిబ్రవరిలో భూపాలపల్లి జిల్లాలోని తొమ్మిది మండలాలతో రెవెన్యూ డివిజన్ గా ఉన్న ములుగును ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయటంతో ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరు ముక్కలైంది. వరంగల్ నగరాన్ని రెండు ముక్కలుగా చేయటంపై పలువురు తప్పు పట్టారు. దీనిపై చరిత్రకారులు అప్పట్లోనే తమ అభ్యంతరాల్ని వ్యక్తం చేసినా.. నాటి కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకున్నది లేదు. విపక్ష నేతగా ఉన్న వేళలో రేవంత్ రెడ్డి సైతం.. వరంగల్ జిల్లాను శాస్త్రీయంగా విభజన చేయలేదన్న వాదనను బలంగా వినిపించారు. ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రిగా ఉన్న నేపథ్యంలో.. గతంలో ఆయన చెప్పినట్లే వరంగల్ రూరల్.. అర్బన్ జిల్లాల్ని ఒకటిగా చేయాలన్న డిమాండ్ అంతకంతకూ ఎక్కువ అవుతోంది. ఈ వాదనకు బీఆర్ఎస్ మినహా మిగిలిన ప్రధాన రాజకీయ పక్షాలు మద్దతు ఇస్తున్న నేపథ్యంలో.. రెండు జిల్లాలు ఒకటి అయ్యేలా ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకునే వీలుందన్న మాట బలంగా వినిపిస్తోంది.

# తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ టీడీపీ ఎంట్రీ



హైదరాబాద్,తెలంగాణ స్థానిక సంస్థలకు జరగనున్న ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు వాసిరెడ్డి రామనాథం ప్రకటించారు. 2018 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలసి పోటీచేసిన టీడీపీ ఆ తరువాత అన్ని ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంది. రానున్న రోజుల్లో తెలంగాణలో టీడీపీ, బీజేపీ, జనసేన కలసి పోటీ చేస్తాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో ఈ కూటమి ఘనవిజయం సాధించింది. ఇదే తరహాలో తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బరిలోకి దిగుతాయని చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే వాసిరెడ్డి ప్రకటన ఊహాగానాలకు మరింత ఊతం ఇస్తోంది. గత కొన్నిరోజులుగా బీఆర్ఎస్ నేతలు తెలుగుదేశం పార్టీ ని చంద్రబాబును టార్గెట్ చేసి విమర్శలు గుప్పిస్తున్నారు. బనకచర్ల ఇష్యూ ను ప్రధానంగా చేసుకొని విమర్శలకు పదునుపెడుతున్నారు. మళ్లీ తెలంగాణ వ్యతిరేకులు అంతా తెలంగాణ పై దాడికి సిద్ధమవుతున్నారని బీఆర్ఎస్ నేతలు కొంత కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేడు రామనాథం ప్రకటన బీఆర్ఎస్ నేతల ఆరోపణలకు బలం చేకూర్చేలా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికల వరకే పరిమితం అవుతుందా %ా% లేక 2028 లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పోటీకి దిగుతుందా అనే విషయం తేలాల్సి ఉంది. స్థానిక ఎన్నికల్లో ఫలితాలపైనే భవిష్యత్తు లో తెలంగాణ లో ఎన్డీఏ కూటమి భవితవ్యం ఆధారపడి ఉంటుంది. అయితే స్థానిక ఎన్నికల్లో కూడా రాష్ట్ర మంతా పోటీచేస్తారా లేక ఖమ్మంతో పాటు మరికొన్ని ఎంపిక చేసిన జిల్లాలకే పరిమితం అవుతుందా అనేది మరికొన్ని రోజుల్లో తేలనుంది.

# భారీ వర్షాలు, వరదలు.. బీజింగ్‌లో 30 మంది మృతి



బీజింగ్: ఉత్తర చైనాలో భీకర వర్షాలు కురుస్తున్నాయి. దీంతో బీజింగ్‌లో వరదలు ముంచెత్తుతున్నాయి. గత వారం రోజుల నుంచి ఆ వర్షాల వల్ల 30 మంది మృతిచెందారని అధికారులు పేర్కొన్నారు. బీజింగ్‌లో అధికారులు హయ్యెస్ట్ ఫ్లడ్ ఎమర్జెన్సీ అలర్ట్ జారీ చేశారు. ఇప్పటి వరకు 80 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరికొన్ని రోజుల పాటు బీజింగ్ పరిసర ప్రాంతాల్లో వరదలు రానున్నాయి. సుమారు 130 గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. డజన్ల సంఖ్యలో రోడ్లు కొట్టుకుపోయాయి. జలమయమైన ప్రాంతాల్లో చిక్కుకున్నవారిని రెస్క్యూ చేస్తున్నారు. వరదల్లో మిస్సైన వారిని రక్షించాలని అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆదేశించారు. సాధారణంగా ఈ సీజన్‌లో బీజింగ్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తుంటాయి. 2012లో జూలైలో వచ్చిన వరదల వల్ల 79 మంది మృతిచెందారు.రికవరీ చర్యల కోసం చైనా ప్రభుత్వం ఇప్పటికే 200 మిలియన్ల యువాన్ల నిధిని కేటాయించింది. డ్యామేజ్ అయిన రోడ్లు, నీటి కేంద్రాలు, వైద్యం, మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేయనున్నారు. మియున్ ముజియా విమానాశ్రయం నుంచి వరద బాధితుల కోసం ఆహార పదార్థాలను తీసుకెళ్లారు. లైఫ్ జాకెట్లను అందిస్తున్నారు. సాధారణంగా ఈ సీజన్‌లో బీజింగ్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తుంటాయి.

# ఎవరు నిజంగా యువత భవిష్యత్తును మారుస్తున్నారు?



హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల రాజకీయ ముఖచిత్రంలో చంద్రబాబు నాయుడు, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ ముగ్గురు నాయకులు తమదైన శైలిలో పాలనను నడిపిస్తున్నారు. అయితే, యువత భవిష్యత్తుకు ఎవరు మెరుగైన దారి వేస్తున్నారనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నేటి ప్రపంచం కేవలం రోడ్లు, పెన్షన్లు, రేషన్లతో సరిపుచ్చుకునేది కాదు. కృత్రిమ మేధస్సు , ఆటోమేషన్, డిజిటల్ ఇన్నోవేషన్‌లు భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తున్నాయి. దేశం ముందుకు వెళ్లాలంటే యువతను గ్లోబల్ స్కిల్స్‌తో సిద్ధం చేయడం అత్యవసరం. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు నాయకుల విధానాలను చాట్ జీపీటీ విశ్లేషించింది. . అభివృద్ధి, సంక్షేమం, ఐటీ, విద్య వంటి రంగాల్లో వారి విధానాలు భిన్నంగా ఉన్నా, 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడంలో ఎవరి విజన్ ఎంతవరకు ఉందని ఏఐ 'చాట్ జీపీటీ'ని ప్రశ్నించగా అది ఆసక్తికర సమాధానాన్ని విశ్లేషణను అందించింది. చాట్ జీపీటీ విశ్లేషణ ఎలా ఉందో తెలుసుకుందాం.

–చంద్రబాబు నాయుడు.. విజన్ విత్ టెక్నాలజీ

చంద్రబాబు నాయుడుకు టెక్నాలజీ పట్ల ఉన్న విజన్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ హబ్‌గా మార్చిన ఘనత ఆయనకు దక్కుతుంది. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, విశాఖను ఫిన్‌టెక్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయి. AI స్కిలింగ్ సెంటర్లు, గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించే ప్రయత్నాలు తిరిగి ఊపందుకున్నాయి. విదేశాల్లో ఉన్న తెలుగు యువత, ఇంజనీర్లు మాత్రం "బాబు వద్దే గ్లోబల్ దృష్టికోణం ఉంది" అని అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తు అవసరాలను ముందుగానే గుర్తించి, దానికి తగ్గ ప్రణాళికలు రచించడంలో చంద్రబాబుకు ఉన్న పట్టు యువతకు అనుకూలంగా మారుతుందన్నది చాట్ జీపీటీ వాదన.

– కేసీఆర్.. స్టార్టప్‌లు, ఐటీ, మెట్రో గ్లామర్

తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లోని ఐటీ, స్టార్టప్ రంగాలు విస్తృతంగా వృద్ధి చెందాయి. టీ–హబ్ , టాస్క్, AI మిషన్ తెలంగాణ వంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. అమెరికా, యూరప్‌లోని టెక్ కంపెనీలు హైదరాబాద్‌ను తమ పెట్టుబడులకు ఎంపిక చేసుకోవడం కేవలం యాదృచ్ఛికం కాదు, ఇది పాలనలో తీసుకున్న గణనీయమైన నిర్ణయాల ఫలితం. అయితే, ఈ వృద్ధి ఎక్కువగా పట్టణ కేంద్రాలకే పరిమితమవుతోందన్న విమర్శ ఉంది. గ్రామీణ యువతకు మాత్రం ఈ ప్రయోజనాలు తక్కువగానే కనిపిస్తున్నాయని చాట్ జీపీటీ ఆందోళన వ్యక్తం చేసింది.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఐటీ రంగంలో వృద్ధి అసమానతలు తెలంగాణలో ఒక సవాలుగా నిలుస్తున్నాయని చాట్ జీపీటీ తెలిపింది..

–జగన్ మోహన్ రెడ్డి.. సంక్షేమంపైనే ఫోకస్, స్కిల్స్‌కు గ్యాప్

జగన్ పాలనలో వైఎస్సార్ చేయూత, వాలంటీర్లు, అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలు గ్రామీణ, పేద ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయి. విద్యను ఉచితంగా అందించడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి ప్రయత్నాలు ప్రశంసనీయం. అయితే, డిజిటల్ జాబ్స్, టెక్ స్కిల్స్, ఇన్నోవేషన్ ఎకోసిస్టంపై దృష్టి సారించడంలో కొంత వెనుకబడి ఉన్నారని చాట్ జీపీటీ అభిప్రాయపడింది. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ, ఐటీ ఉద్యోగాల్లో అవకాశం లేని స్థితిలో ఉన్నారనే ఆందోళన జగన్ పాలనలో వ్యక్తమైంది. సంక్షేమం ముఖ్యమైనదే అయినా, భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై మరింత దృష్టి సారించాలనేది చాట్ జీపీటీ కోరిక.

–ఎవరు నిజంగా యువత భవిష్యత్తును మారుస్తున్నారు?

చంద్రబాబు: భవిష్యత్తు అవసరాలను ముందే అర్థం చేసుకుని, AI, ఫిన్ టెక్, డిజిటల్ స్కిల్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టే నాయకుడు.

కేసీఆర్ / కేటీఆర్: ఇప్పటికే హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ నెట్‌వర్క్‌లో స్థిరం చేసిన నాయకత్వం.

జగన్: పేదలకు విద్య, సంక్షేమం అందించినా, టెక్–ఫోకస్, నైపుణ్యాల పెంపుదలలో వెనుకబడిన పాలన.

ఈ మూడు అభిప్రాయాలను చాట్ జీపీటీ క్లుప్తంగా వ్యక్తపరిచింది.

చాట్ జీపీటీ ఎన్ని వివరణలు, విశ్లేషణలు ఇచ్చినా కూడా.. పాలకులు ఎవరనేది ముఖ్యం కాదు, వారి విజన్, దాని అమలు తీరు, యువతకు అందే ప్రత్యక్ష ప్రయోజనం ఎంత అన్నదే అసలైన విషయం. అసెంబ్లీలో ఎవరు పెద్దగా అరిచారనే దానికంటే, యువతను ఎవరు నిశ్శబ్దంగా భవిష్యత్ ప్రపంచానికి సిద్ధం చేస్తున్నారో మనం గమనించాలి. AI, డిజిటలైజేషన్, గ్లోబల్ మార్కెట్లు... ఇవన్నీ కొత్త శక్తులుగా మారుతున్న ఈ కాలంలో పాలకుడు ముందుచూపుతో ఉండాలి, దానిని సమర్థవంతంగా అమలు చేయగలగాలి . ఇప్పుడు యువత అడగాల్సిన ప్రశ్న "నా భవిష్యత్తు కోసం నా ఈ రోజు ఎవరు సిద్ధం చేస్తున్నారు?" అని.. ఈ ప్రశ్నకు సమాధానం దొరికితేనే తెలుగు రాష్ట్రాల యువత నిజమైన పురోగతిని సాధించగలదు.

# సారీ చెప్పేది ఇలానా? ఆ మంత్రి పై సుప్రీం సీరియస్



న్యూఢిల్లీ,ఆపరేషన్ సిందూర్ వేళ.. భారత ఆర్మీ అధికారిణి కల్నల్ సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి కువ్వర్ విజయ్ షా తీరును తీవ్రంగా తప్పు పట్టింది దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం. బహిరంగ క్షమాపణలు చెప్పకుండా తమ సహనాన్ని పరీక్షిస్తున్నారంటూ సీరియస్ అయిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. మంత్రి ప్రవర్తన తీరుపై అనుమానాల్ని వ్యక్తం చేసింది.మంత్రి ప్రవర్తన.. వ్యాఖ్యల వెనుక ఉన్న ఉద్దేశాన్ని తాము అనుమానించాల్సి వస్తోందంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్య కాంత్.. జస్టిస్ జోయ్ మల్య బాగ్చిల ద్విసభ్య ధర్మాసనం ఘాటుగా స్పందించింది. ఆపరేషన్ సిందూర్ వేళ.. కల్నల్ సోఫియా.. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ లు మీడియాకు జరుగుతున్న పరిణామాల్ని ఎప్పటికప్పుడు వెల్లడించటం తెలిసిందే. వీరిపై మంత్రి కున్వర్ విజయ్ షా అనుచిత వ్యాఖ్యలు చేయటం.. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తటం.. సుప్రీంకోర్టు సైతం సారీ చెప్పాలని ఆదేశించింది.ఈ ఉదంతంపై సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులతో కూడిన సిట్ ను ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వానని ఆదేశించింది. మంత్రిపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో మంత్రి తన క్షమాపణల్ని తూతూ మంత్రంగా చెప్పటాన్ని సుప్రీం తప్పు పట్టింది. క్షమాపణలు చెప్పినట్లుగా రికార్డు చేయాలని.. దాన్ని తాము చూడాలని అనుకుంటున్నట్లుగా ధర్మాసనం స్పష్టం చేసింది. అంతేకాదు.. సిట్ ను ఆగస్టు 13 లోపు నివేదిక ఇవ్వాలని పేర్కొంది.మంత్రి చేసిన ప్రకటనతో పాటు ఇదే అంశంపై ఇతరులు చేసిన అనుచిత వ్యాఖ్యల్ని కూడా రికార్డు చేయాలని చెప్పిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఆగస్టు 18వ తేదీకి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు తాజాగా ఆగ్రహించిన వేళ.. ఇప్పటికైనా మధ్యప్రదేశ్ మంత్రి తన తీరును మార్చుకుంటారా? అత్యుత్తమ న్యాయస్థానం చెప్పినట్లు క్షమాపణలు చెబుతారా? అన్నది ప్రశ్నగా మారింది.

# ఫేషియల్ రికగ్నిషన్ తో చేయూత...



హైదరాబాద్ : తెలంగాణలో చేయూత పెన్షనర్లకు గుడ్ న్యూస్. జూలై 29 నుంచి ఫేషియల్ రికగ్నిషన్ విధానం ద్వారా పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. వేలిముద్రలు సరిగా లేకపోవడం, మోసాలను నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. తొలిదశలో పోస్టాఫీసుల ద్వారా పెన్షన్ పొందే 23 లక్షల మందికి ఇది వర్తిస్తుంది. దీనికోసం ప్రత్యేక యాప్, కొత్త స్మార్ట్‌ఫోన్లు, శిక్షణ వంటి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఫేషియల్ రికగ్నిషన్ సాధ్యం కానివారికి బయోమెట్రిక్ లేదా గ్రామ కార్యదర్శుల ద్వారా పెన్షన్ అందజేస్తారు. ఈ కొత్త విధానంతో పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో చేయూత పెన్షన్లు తీసుకునే వారికి గుడ్ న్యూస్. ఇక నుంచి పెన్షన్లు తీసుకునే సమయంలో ఇబ్బందులు ఉండవు. జూలై 29 నుండి ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) విధానం ద్వారా చేయూత పెన్షన్లను పంపిణీ చేయాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఈ వినూత్న పద్ధతి ద్వారా 44 లక్షల మంది లబ్ధిదారులకు పారదర్శకంగా పెన్షన్లు అందజేయటమ ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న బయోమెట్రిక్ విధానంలో కొన్ని సవాళ్ల ఎదురవుతున్నాయి. ముఖ్యంగా, చాలా మంది వృద్ధుల వేలిముద్రలు అదృశ్యం కావడంతో వారికి పెన్షన్లు అందడం లేదు. అంతేకాకుండా, కొంతమంది పెన్షనర్ల నిధులను ఇతరులు మోసపూరితంగా కాజేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, ప్రభుత్వం టీజీ ఆన్లైన్ సంస్థ సాంకేతిక సహకారంతో ముఖ గుర్తింపు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. మొదటి దశలో, పోస్టాఫీసుల ద్వారా పెన్షన్లు పొందుతున్న 23 లక్షల మందికి మాత్రమే ఈ విధానం వర్తిస్తుంది. నగరాలు, పట్టణాల్లోని బ్యాంకు ఖాతాల ద్వారా పెన్షన్లు పొందుతున్న 21 లక్షల మందికి ప్రస్తుత విధానమే కొనసాగుతుంది. ఈ కొత్త విధానం కోసం ప్రత్యేకంగా ఒక యాప్ రూపొందించా రు. పోస్టు మాస్టర్లు, పోస్టుమ్యాన్లు, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లకు ఈ యాప్ను ఉపయోగించటంపై ఇప్పటికే ట్రైనింగ్ ఇచ్చారు. సుమారు రూ.13 కోట్లతో 6,000 మంది పోస్ట్మ్యాన్లు, పోస్టుమాస్టర్లకు కొత్త స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చారు.

పెన్షన్ పంపిణీలో నూతన విధానం ప్రారంభానికి ఏర్పాట్లు

రాష్ట్రస్థాయి అధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తి కాగా.. నేడు పోస్టల్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులకు శిక్షణ ఇస్తారు. అనంతరం వారు యాప్ను డౌన్లోడ్ చేసుకుంటారు. సోమవారం పెన్షన్లకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుంది. మంగళవారం నుంచి ఈ కొత్త విధానాన్ని ప్రారంభించాలని అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులు పోస్టాఫీసుకి వెళ్ళినప్పుడు వారి ఫోటో తీసి ఆధార్లో ఉన్న ఫోటోతో సరిపోల్చి యాప్లో అప్లోడ్ చేస్తారు.ఆ తర్వాత వారికి పెన్షన్ చెల్లిస్తారు. ఒకవేళ ఎవరైనా ఫోటోలు తీయలేని పరిస్థితిలో ఉంటే, వారికి బయోమెట్రిక్ విధానం ద్వారా పెన్షన్ ఇస్తారు. ముఖ గుర్తింపు, బయోమెట్రిక్ రెండూ పనిచేయని సందర్భాలలో గ్రామ కార్యదర్శులు వేలిముద్రలు వేసి పెన్షన్ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కొత్త విధానం వల్ల పెన్షన్ పంపిణీలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం వస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

## జూరల 12 గేట్లు ఎత్తివేత..

గద్వాల,జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల జలాశయానికి ఇన్ ఎలో1,00,257 వేల క్యూసెక్కులుండగా ఔట్ ఎ÷–లో 92,556 క్యూసెక్కులుగా ఉంది. జూరాల ప్రాజెక్టు 12 గేట్లు– ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318.816 మీటర్లు ఉండగా ప్రస్తుత నీటి నిల్వ 317.170 మీటర్లుగా ఉంది. జూరాల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 7.795 టిఎంసిలుండగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com